సీరియల్

అగ్ని కెరటం

ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

అక్కడినించీ చిన్న చిన్న గుడిసెలు కనిపించటం మొదలుపెట్టాయి. ఆ ఇళ్ళ ఎదుట చిన్న చిన్న పిల్లలు నిలబడి వరుసగా నడిచివస్తున్న నాగరిక మనుషులను వింతగా చూస్తూ కిచకిచలాడటం మొదలుపెట్టారు.

కొన్ని సెకన్లు మాత్రమే గడిచాయి.

పూర్తిగా గూడెంలోకి ప్రవేశించారు.

అప్పుడే అప్పటివరకు ఆ వెలుగు గురించి వాళ్ళు ఫీలవుతున్న సస్పెన్స్—టెన్షన్ పటాపంచలయ్యింది.

ఆ వెలుగేమిటో తెలియగానే వాళ్ళ గుండెలు ఆగినంత పనయ్యింది. అంతా విగ్రహాల్లా ఐపోయారు.

గూడెం మధ్యలో దాదాపు పదిహేను మీటర్ల ఎత్తున పెద్ద నోరు తెరుచుకున్న ఓ దేవత విగ్రహం ఉంది. ఆ దేవత మెళ్ళో ఉన్న పెద్ద హారం మధ్యలో

ఉంది ఓ మణి. అక్కడే వెలుగుతున్న కాగడాల వెలుతురుపడి ఆ మణి ప్రకాశిస్తోంది. ఆ తేజస్సు వెదజల్లుతోంది ఆ మణి అని తెలియగానే భారత్ కు గుండెల్లో ఏదో అలజడి మొదలయ్యింది.

ఇంతకు ముందు యెన్నోసార్లు పూర్వం అలాంటి మణులు ఉండేవని విన్నాడు. అవి సూర్యుని కాంతి లాంటి తేజస్సును కలిగివుండేవని చదివాడు. కాని ప్రత్యక్షంగా చూడటం ఇదే మొదటిసారి.

"స్టెల్లా, అపురూపం కదూ" అన్నాడు.

"అవును. ఎయిత్ వండర్ అనిపిస్తోంది. ఈ మణి ముందు నీ దగ్గర ఉన్న వజ్రాలు యెందుకూ పనికిరావు. కేవలం గాజుముక్కలతో సమానం" అన్నది.

"అవును. నాకూ అలాగే అనిపిస్తోంది" అన్నాడు దాన్నే చూస్తూ.

• • •

వాళ్ళందరినీ ఆ గూడెం మధ్యలో వున్న పెద్ద గుడిసె దగ్గరకు తీసుకువెళ్ళారు. ఆ గుడిసె మిగిలిన వాటికంటే కొంచెం పెద్దదిగా వుంది. దాని బయట అటూ యిటూ రెండు కాగడాలు వెలుగుతున్నాయి.

వాళ్ళని అక్కడే వుంచి వాళ్ళలో ఒకడు లోపలకు వెళ్ళాడు. రెండు నిముషాల తర్వాత లోపల్నించి కొంచెం వయసు మళ్ళినవాడితో బయటకు వచ్చి అక్కడే నిలబడి వున్న నాగరికులను చూపించి వాళ్ళ భాషలో యేదో కిచకిచలాడాడు వాడు.

తర్వాత ఆ ముసలాడిని చూపించి యేదో చెప్పి యేం చెయ్యాలో చూపించాడు.

వాడు ఆ జాతివాళ్ళ కుల పెద్ద అనీ వాళ్ళకు వాడే

నాయకుడనీ వాడికి అభివాదం చెయ్యమంటున్నాడనీ గ్రహించారు వాళ్ళు. వాడు చూపించినట్టుగానే చేశారు.

వెనక్కి వంగి ఒక చేతిని గాల్లో పైకెత్తారు.

అది ఆ జాతివాళ్ళల్లో గౌరవసూచకంగా అభివాదం చేసుకోవటం.

స్టెల్లా మనసులోనే ఆ జాతినంతటినీ తిట్టుకుంది.

అప్పటికప్పుడే అక్కడికి నాలుగైదు వెదురు కర్రలతో చేసిన మంచాలు లాంటివి తీసుకువచ్చారు. అవి బాగా పొడుగ్గా రైలుపెట్టెల్లా వున్నాయి. వాళ్ళంతా పొడుగ్గా వున్నారు కాబట్టి వాళ్ళకు అంత పొడుగ్గా వుంటేకాని సరిపోవు.

అంతా కూర్చున్నారు.

ప్రతి యింటి బయటా ఒక్కో కాగడా వెలుగుతోంది. ఆ వెలుతుర్లో ఆ ప్రదేశమంతా ఎంతో క్లియర్‌గా కనపడుతోంది.

ఆ వెలుగులో ఎంతో ఎత్తుగా భయం కలిగించేలా వున్న దేవత విగ్రహం ఆ విగ్రహం మెళ్ళో వున్న హారంలో ధగధగ మని మెరిసిపోతున్న మణి కనపడుతున్నాయి.

బాగా ఎత్తుగా వున్న కొయ్య సింహాసనం లాంటి దాన్ని లోపల్నించి మోసుకువచ్చి మంచాల ఎదురుగా వేశారు. దానిమీద నాయకుడు ఠీవిగా కూర్చుని మీసాలు మెలివేశాడు.

స్టెల్లా—భారత్ పక్క పక్కనే కూర్చుని నాయకుడిని అదోలా చూశారు.

నాయకుడి కళ్ళు తీక్షణంగా దేగ కళ్ళలా

వున్నాయి. నల్లగా శిలలా వున్నాడు. అలాంటి మను
షుల్లో మంచితనం వుంటుందంటే నమ్మశక్యంగా అని
పించలేదు.

కాని ఆశ్చర్యం!

ఆ మనుషులు మంచివాళ్ళు! తీసుకొచ్చి నాగరికుల్లాగే
మంచాలు వాల్చి కూర్చోబెట్టారు.

నిముసాలమీద వెదురుగొట్టాలతో వాళ్ళందరికీ యేదో
పానీయం తీసుకవచ్చి యిచ్చారు వాళ్ళు.... ఈసారి మగ
వాళ్ళతో పాటు నలుగురు ఆడవాళ్ళు కూడా వచ్చారు.
వాళ్ళు మొలకు యేదో చర్మాన్ని చుట్టుకున్నారు కాని
వక్షభాగంలో మాత్రం యిలాంటి అచ్ఛాదన లేదు. ఆడ
వాళ్ళ మొహాల్లో ఎలాంటి కళ, కాంతీ లేవు.

ఆ పానియం ఎర్రటి రంగులో నెత్తురులా వుంది.
దాన్ని తాగటానికి సంశయం కలిగింది.

ఆ సంశయాన్ని చూసి 'బాగానే వుంటుంది తాగం
డన్నట్టు' చేత్తో సైగ చేశాడు నాయకుడు.

భారత్ దాన్ని చిన్నగా సిప్ చేశాడు.

తియ్యగా వుంది.

జలాశయం వొడ్డున తిన్న చిన్న చిన్న పండ్ల రుచి
లోనే వుంది ఆ పానీయం.

"బాగుంది. తాగండి" అన్నాడు భారత్.

అప్పుడే మిగిలిన వాళ్ళంతా ఆ పానీయాన్ని గబగబా
తాగేశారు. దాన్ని తాగిన తర్వాత యింకా తాగాలని
అనిపించింది.

"షాంకీల్ వుంటే బావుండేది" అన్నాడు భారత్.

అప్పటివరకూ అతడిని మరచిపోయినందుకు ఆశ్చర్య
పడింది సెల్లా.

"అవును. దొంగయినా మనకోసం ప్రాణాలు పోగొట్టుకున్నాడు. మనతో కలిసి వుంటే బావుండేది. ఒక రకంగా పాంకీల్ ప్రాణాలు మనమే తీశామేమో! ఇప్పుడు వుంటే యెంతో తియ్యగా వున్న ఈ పానీయం తాగేవాడు. ఎక్కడ పుట్టాడో, ఎక్కడ పెరిగాడో చివరకు యీ దీవిలో విష పంషుకు బలై పోయాడు" అన్నది.

కొంచెంసేపటి తర్వాత కొంచెం ఎత్తు తక్కువగా వున్న చెక్కల కుర్చీని తీసుకువచ్చి నాయకుడి సింహాసనం పక్కగా వేశారు.

గాలికి కాగడాలు చిన్నగా వూగుతున్నాయి.

ఉన్నట్టుండి యెవరో డప్పులు మోగిస్తున్న మోత వినిపించింది వాళ్ళకు—కొంచెం దూరంలో....

వాటిని యెందుకు మోగిస్తున్నారో అర్థం కాలేదు.

"ఎందుకీ డప్పు?" అడిగింది స్టెల్లా.

"తెలీదు. ఈ జాతుల ఆచారాలు చాలా చాదస్తంగా వుంటాయి. వీళ్ళంతా మూఢనమ్మకాల్లో పుట్టి అందులోనే పెరిగి అందులోనే అంతరించిపోతూ వుంటారు. వాళ్ళు ఏ పని ఎప్పుడు ఎందుకు చేస్తారో కూడా మనం వూహించలేము. ఇప్పుడు ఈ డప్పుల మోత కూడా అంతే. ఇంతకీ ఆ నాయకుడి ఆసనం పక్కనే మరో ఆసనం వేశారు. ఇద్దరు మనుషులకు నాయకుడు తన కిచకిచ భాషలో ఏదో చెప్పి పంపాడు. దీన్నిబట్టి నీకేమర్థమవుతోంది? ఈ నాయకుడు ఎవరికోసమో ఎదురుచూస్తున్నాడు కదూ?" అడిగాడు భారత్.

"అవును. నేనూ అలాగే అనుకున్నాను. ఏమయినా మన భాష తెలీని ఈ మొరటు మనుషులు మనం ఈ దీవి

నించి బయటపడటానికి సహాయపడతారనుకుంటే ఎందుకో నాకు నమ్మశక్యంగా అనిపించటం లేదు."

"అలా నిరుత్సాహపడకు. ప్రస్తుతం మనకు వీళ్ళను ఆశ్రయించటం తప్పించి మరో మార్గం లేదు."

"నిరుత్సాహం కాదు భారత్. వీళ్ళు మనకు సహాయ పడకపోవచ్చునని నా నమ్మకం."

వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకుంటున్నప్పుడు వున్నట్టుండి యేదో కలకలం లాంటిది వినిపించింది.

తలలు తిప్పి చూస్తే కొంతమంది ఆ జాతి మనుషుల మధ్య నడిచివస్తున్న ఓ మామూలు మనిషి కనిపించాడు. కొంచెం దగ్గరకు రాగానే ఆ మనిషిని చూసి నైల్లా ఆశ్చర్యపడింది.

* * *

ఆయన వయస్సు అరవై యేళ్ళ వరకు వుంటాయి. జుట్టంతా పొడుగ్గా పెరిగి తెల్లగా నెరిసిపోయి వుంది. కళ్ళు కూడా లోపలకు పీక్కుపోయి జీవం లేకుండా వున్నాయి. గడ్డం నెరిసిపోయి బాగా పొడుగ్గా పెరిగి వున్నది. బాగా వెనక్కు వాలినట్టున్న పెద్ద పెద్ద చెవులు. పొడుగ్గా వున్న ముక్కు.

నడుముకు మిగిలినవాళ్ళలాగే యేవో చర్మాన్ని చుట్టుకున్నాడు. ఛాతీమీద కూడా ఓ, చర్మాన్ని షర్టులా కట్టుకొని వేసుకున్నాడు. చేతిలో వంపు తిరిగిన పొడుగు కర్ర వుంది.

దాని సాయంతోనే నడుస్తూ వచ్చాడు.

ఆయన్ని చూడటంతోనే ఒక్కసారి లేచి నిలబడి నాయకుడు కిచకిచ లాడాడు. ఆయనా నడుం వెనక్కు వంచి చేతిని గాల్లోకి లేపి నాయకుడికి అభివాదం

చేశాడు.

తర్వాత తనకై ఎదురుచూస్తున్న ఆసనంమీద కూర్చున్నాడు.

నాయకుడే ఆయన్ని చూసి లేచాడని వీళ్ళు కూడా లేచి నిలబడ్డారు. వాళ్ళు కూర్చున్న తర్వాత మళ్ళీ కూర్చున్నారు.

టెల్లా ఆయన గురించే ఆలోచిస్తోంది. ఆయన యీ జాతి మనిషి కాదు. నాగరికుడే. కాని అనాగరికుల్లో కలిసిపోయి అలాగే అనిపిస్తున్నాడు.

ఎదురుగా వెదురు మంచాలమీద కూర్చునివున్న నాగరికులను చూశాడాయన. వాళ్ళని చూపుతూ నాయకుడు ఆయనకు కిచకిచ భాషలో యేదో చెప్పాడు.

ఆయన తల వూపాడు వింటూ.

అప్పటికి గూడెంలో వున్న ఆ జాతి మనుషులంతా పిల్లలతో కలిసి వాళ్ళని చూట్టానికి వచ్చేశారు. వాళ్ళందరూ చుట్టూ చేరి అలా తమందరినీ చూపులతో తినేస్తుంటే టెల్లా సహించలేకపోయింది. ముఖ్యంగా వాళ్ళనించి వస్తున్న వెగటు వాసన ఆమెకు భరించరానిదిగా తయారయ్యింది.

టెల్లా అందం అక్కడకు వచ్చిన వారందరినీ ఆకర్షించింది. ఆమెనే వింతగా యెక్కువసేపు చూశారు వాళ్ళు.

ఆయన నాయకుడు చెప్పినదంతా విని లేచి భారత్ దగ్గరకు వచ్చాడు. భారత్ లేచి నిల్చున్నాడు.

“ఐయామ్ ఆండ్రూస్. బ్రిటిషర్ని” అన్నాడు ఆంగ్లంలో.

ఆశ్చర్యంతో పాటు భారత్‌కు సంతోషం కూడా కలి

గింది — ఆంగ్లం తెలిసిన మనిషి ఆ అటవికుల్లో దొరికినందుకు.

ఆమాంతం ఆంద్రూస్‌ను కౌగిలించుకొన్నంత పని చేశాడు. ఇక తమకు ఎలాంటి భయం లేదు ఆ దీవిలో. ఆంద్రూస్ సాయంతో యెలాగయినా ఆ దీవినించి బయటపడవచ్చునన్న ఆశ పూర్తిగా కలిగింది.

వెంటనే తనని పరిచయం చేసుకున్నాడు భారత్. వరుసగా మిగిలిన వాళ్ళందరినీ పరిచయం చేసి ప్లేన్‌లో దొంగల గురించి విమానం దీవిలో కూలిపోవటం వరకు అంతా ఆంద్రూస్‌తో చెప్పేశాడు.

అలా జరిగినందుకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తపరిచాడు ఆంద్రూస్.

తర్వాత భారత్ చెప్పిన కథ నంతటినీ కిచకిచ భాషలో నాయకుడికి అక్కడ వున్న వాళ్ళందరికీ వివరించి కొంత యాక్షన్‌ని కూడా కలిపి చెప్పాడు.

అంతా విని నాయకుడు కూడా తన భాషలో ఏదో అన్నాడు గబగబా చేతులు తిప్పుతూ—

"నాయకుడు కూడా యిలా జరిగినందుకు విచారపడుతున్నాడు" అని ఆ భాషను ఆంగ్లంలోకి తర్జుమా చేసి చెప్పాడు ఆంద్రూస్.

"మీరు బ్రిటీషర్ అయివుండి ఈ దీవిలోకి యెందుకు వచ్చారు? ఈ మొరటుమనుషుల్లో యెందుకు కలిసిపోయారు? మిమ్మల్ని చూస్తుంటే చాలా యేళ్ళుగా మీరు ఈ దీవిలో వీళ్ళతోనే కలిసి జీవిస్తున్నట్టుగా అనిపిస్తోంది" అన్నాడు భారత్.

అందుకు ఆంద్రూస్ నవ్వి "అదంతా ఒక కథలే. తర్వాత తీరిగ్గా చెబుతా... ఇప్పుడు కాదు. ముందు అతిథు

లకు మర్యాదల గురించి విచారించకపోతే ఈ నాయకుడు వూరుకోడు. అతిథి మర్యాదలు పాటించటంలో ఈజాతి వాళ్ళకు మన నాగరికులు కూడా సాటిరారు. మీకు ఎర్రటి పానీయం అందజేయబడిందా?" అని అడిగాడు.

తల వూపాడు భారత్.

అప్పుడే అతని కడుపులో ఆకలి మంట దహించుకు పోతున్నట్టుగా అనిపించింది.

తనకేనా? మిగిలిన వాళ్ళక్కూడా అలాగే అనిపిస్తోందా? కేవలం రెండు గంటల క్రితమే ఆకలి పూర్తిగా తీరిపోయేంతగా నీటిమడుగు దగ్గర చిన్న చిన్న పండ్లను తిన్నాడు. కొన్ని నిముషాల క్రితమే ఎర్రటి పానీయాన్ని తాగాడు.

అయినా అప్పుడే ఆకలి బాధిస్తోంది—

సరిగ్గా అప్పుడే అన్నది స్టెల్లా—

"నాకు భరించలేనంత ఆకలిగా వుంది."

"స్టెల్లా....నాకూ అలాగే వుంది. ఆశ్చర్యంగా వుంది కదా....మనం అక్కడ తిన్న పండ్లకు కనీసం ఆరుగంటల వరకయినా ఆకలి కాదని అనుకున్నాను. నేనూ ఈ ఆకలి బాధను భరించలేకుండా వున్నాను" అన్నాడు భారత్.

అప్పుడే ఒక్కొక్కరూ తమను వేధిస్తున్న ఆకలి బాధ గురించి స్టెల్లాతో భారత్‌తో చెప్పటం మొదలు పెట్టారు.

"ఏమిటి?" అడిగాడు ఆండ్రూస్.

ఆకలవుతోందని చెప్పటానికి బిడియపడ్డాడు భారత్. అందుకే "ఏమీ లేదు" అన్నాడు.

"ఏదో వుంది. దయచేసి మీరు మనసులో వున్న విషయాన్ని చెప్పటానికి సంకోచించకండి."

ఆండ్రూస్ అంతగా చెప్పిన తర్వాత "మా అందరికీ బాగా ఆకలవుతోంది. భరించలేకుండా వున్నాం. నిజానికి ఈ సమయంలో మాకు యిలా ఆకలి అనిపించటం ఆశ్చర్యంగా వుంది. ఎందుకంటే?" అని జలాశయందగ్గర చిన్న చిన్న పండ్లు తినటం, గూడెంలో ఎర్రటి పానీయం తాగటం గురించి చెప్పాడు భారత్.

నవ్వాడు ఆండ్రూస్.

నవ్వుతూనే "ఆ చిన్నపండ్ల లక్షణమే అది. ఆకలి తీరటానికి ఆ పండ్లను యెంత యెక్కువగా తీసుకుంటే అంత తక్కువ వ్యవధిలోనే యెంతో ఆకలి మంటను ఆ పండ్లు కలగజేస్తాయి. ఆ పండ్లలో తీసిన రసమే ఎర్రటిపానీయం. కొంచెం తీసుకొంటే చాలు అరగంట లోపలే భరించలేనంత ఆకలి అవుతుంది. ఆ ఆకలి తీరటానికి మీరు ఎంతో తిండి తింటారు" అన్నాడు.

వారికి ఆకలవుతోందని ఆండ్రూస్ నాయకుడికి చెప్పాడు. నాయకుడు వెంటనే పక్కనే నిలబడివున్న మనుషులకు యేవో ఆజ్ఞలు జారీచేశాడు.

వాళ్ళు వెళ్ళిపోయారు.

నిముషాలు గడుస్తున్నాయి.

ఉన్నట్టుండి భారత్ కు షాంకీల్ తిన్న విషపండ్ల చెట్టు గురించి గుర్తుకు వచ్చింది.

వెంటనే ఆ పండ్ల గురించి అడిగాడు.

"మైగాడ్. అవి చాలా విషపూరితమైన పండ్లు. పొరపాటున కూడా పక్షులు సైతం ఆ పండ్లదగ్గరకే వెళ్లవు. అసలు ఆ చెట్టుమీదనే వాలవు. భయంకరమైన విష సర్పంలో వుండే విషం లాంటిదే ఆ పండ్ల నిండా వుంటుంది. ఆ పండును కొరికిన తర్వాత మనిషి బతకట

మనేది అసాధ్యం" అన్నాడు ఆంద్రూస్.

అప్పుడు చెప్పాడు భారత్ — షాంకీల్ ఆ పండును తిని ప్రాణాలు పోగొట్టుకోవటం గురించి.... ఆ తర్వాత అతడిని అక్కడే గొయ్యి తవ్వి పూడ్చిపెట్టటం గురించి....

ఆ విషయాన్ని వినగానే అదిరిపడ్డాడు ఆంద్రూస్.

క్షణం తర్వాత "మీరు పొరపాటు చేశారు" అన్నాడు.

"ఏమిటి?"

"ఈ విషయం ఈ జాతి మనుషులకు తెలిసిందంటే వాళ్ళు శిక్షిస్తారు" అన్నాడు మళ్ళీ....

"వివరంగా చెప్పండి" భారత్ అడిగాడు.

"మరణించిన మనుషులను యీ దీవిలో యెక్కడా పూడ్చిపెట్టరు. తీసుకెళ్ళి సముద్రంలో పారేసి వస్తారు. పూడ్చిపెట్టిన మనుషుల ప్రేతాత్మ గాల్లో కలిసి యిక్కడే తిరుగుతూ వాళ్ళను బాధిస్తూ వుంటుందని వాళ్ళ నమ్మకం."

ఆ మాటలు వినగానే భారత్ మొహం అదోలా అయ్యింది. అలాంటి ఆచారం వుందని తమకు తెలీదు. షాంకీల్ చనిపోయే వరకు దీవిలో అసలు మనుషులు వున్నారనే విషయమే తమకు తెలీదు. అలాంటప్పుడు అందులో తను బాధపడవలసింది యేదీ లేదు.

అదే మాటను ఆంద్రూస్‌తో అన్నాడు.

"నువ్వెన్ని చెప్పినా అందువల్ల ఉపయోగం లేదు. కేవలం మూఢనమ్మకాలకే విలువ యిచ్చే మనుషులు వీళ్ళంతా... మన రీజనింగ్, మన సంజాయిషీలు వీళ్ళకు పనికిరావు. ఏమైనా మీరు పొరపాటు చేసినట్టే లెక్క

వీళ్ళ దృష్టిలో. ఐతే ఆ విషయాన్ని వాళ్ళు తెలుసుకో నంత వరకు ఇబ్బంది లేదు."

"పోనీ, నన్ను ఓ పని చెయ్యమంటారా?"

"ఏమిటి?"

"తెల్లవారుతూనే ఆ ప్రదేశానికి వెళ్ళి పాతి పెట్టిన ఆ శవాన్ని బయటకు తీయించి సముద్రంలో విసిరేసే యేర్పాట్లు చెయ్యమంటారా?"

"వద్దు. అది మరీ ప్రమాదకరమయిన పని. ఆ శవాన్ని బయటకు తీస్తున్నప్పుడు ఎవరైనా చూశారంటే దాని పరిణామం చాలా ఘోరంగా వుంటుంది. అందువల్ల మీరు ఇక ఆ విషయంలో మవునంగా వుండండి. ఎలా జరగ వలసి వుందో అలాగే జరుగుతుంది."

భారత్ యేదో మాట్లాడబోయాడు కాని యింత లోనే "ఇక మాటలు అనవసరం అనుకుంటాను. ఆ విషయం గురించి ఎక్కువ మాట్లాడవద్దు" అన్నది సెల్లా చిన్నగా అప్పటివరకు ఆ సంభాషణను జాగ్రత్తగా విని.

ఆమె మాటలు ఆంబ్రోస్‌కు సరిగా వినిపించలేదు. అందుకే "ఏమిటీ ఆమె అంటున్నది?" అనడిగాడు.

"ఏమీ లేదు. బాగా ఆకలవుతోందని అంటుంది."

"అలాగా....ఏర్పాట్లు జరుగుతున్నాయి. తిండి గురించే కొంతమంది మనుషులు వెళ్ళారు. వస్తూవుంటారు" అన్నాడు.

"ఇంతకీ ఈ దీవి పేరేమిటో అడగటం మరచి పోయాను" ఉన్నట్టుండి భారత్ అన్నాడు.

"టకారా."

"టకారా దీవా! ఇంతకు ముందెప్పుడూ ఈ దీవి పేరు విన్లేదు."

ఆ మాటకు నవ్వాడు ఆండ్రూస్.

"సముద్రంలో యిలాంటి దీవులు కొన్ని వందలు వున్నాయి. అన్ని దీవుల గురించి ఇంతవరకు యెవ్వరికీ తెలీదు. అలా తెలియని దీవుల్లో ఇది కూడా ఒకటి."

"ఏ ప్రాంతంలో వుంది ఈ దీవి?"

"తెలీదు."

"తెలీకుండానే ఈ దీవికి వచ్చారా?"

మళ్ళీ నవ్వాడు ఆండ్రూస్.

"మీరంతా ఈ దీవి గురించి తెలిసే వచ్చారా?"

"అంటే?"

"అవును. చెప్పాను కదా అదంతా ఓ కథ అని. తర్వాత చెబుతాను. అదిగో, మీకు ఆహారం వచ్చింది. ముందు ఆకలి తీర్చుకోండి."

అప్పుడే ఓ పదిమంది మనుషులు—ఆదులో ఇంతకు ముందు పానీయం అందించిన స్త్రీలు కూడా వున్నారు—వెడల్పుగా వున్న ఆకులతో కట్టిన విస్తళ్ళలో బాగా వండిన మాంసాన్ని వుంచి వరుసగా అందరికీ యిచ్చారు.

ఆ మాంసం బాగా సువాసనలు వెదజల్లుతోంది. ఆ వాసన తగలటంతోనే వున్నట్టుండి ఆకలి మరింతగా పెరిగిపోయింది. వాళ్ళ చేతుల్లోనించి ఆకులను లాక్కుని ఆవురావురుమంటూ తినసాగారు.

ఆండ్రూస్—వాళ్ళు ఆత్రంగా తినటాన్ని చూసి చిన్నగా నవ్వుకున్నాడు. అంతా ఆ చిన్న పండ్ల ప్రభావమే అనుకున్నాడు

అలాంటి మాంసాన్ని ఇంతకుముందెప్పుడూ వాళ్ళు తినివుండలేదు. దాని గురించి ఆండ్రూస్‌ను అడగాలనుకున్నాడు భారత్. కాని అడగటానికి అది సమయం

కాదు. ముందు ఆకలితీరాలి. ఆ తర్వాతనే ఇక ఏ కబురయినా.

నెల్లాకూడా ఆ మాంసాన్ని తింటూ బాగా ఆశ్చర్యపడింది. అంత మొరటుగా వున్న ఆ మనుషులు అంత రుచిగా మాంసాన్ని వండుతారని వూహించలేదు.

కొంచెంసేపటి తర్వాత ఆకలిబాధ తీరింది.

అలాంటి మంచి భోజనాన్ని ఏర్పాటు చేసినందుకు నాయకుడికి అంతా కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. ఆ విషయాన్ని ఆండ్రూస్ నాయకుడికి చెప్పాడు. అందుకు నాయకుడు నవ్వి కిచకిచ లాడాడు ఏదో....

"అతిథులను సంతోషపరచటమే మా లక్ష్యం" అంటూ చెప్పాడు ఆండ్రూస్.

అప్పటికే బాగా పొద్దుపోయినట్లనిపించింది. నిజానికి నగరాల్లో ఐతే ఆ టైముకు పొద్దుపోయినట్టు కాదు.

కాని—దీవుల్లో అలా కాదు.

వెలుగు పోవటంతోనే పొద్దు పోతుంది.

అప్పుడు అడిగాడు భారత్—ఆండ్రూస్‌ను.

"ఇప్పుడు మాకు వడ్డించిన మాంసం ఏ జంతువుది?"

"ఇక్కడ దాన్ని నల్ల మృగం అంటాము. ఈ దీవిలో బాగా లోపలకు వెళితే దట్టమైన అడవివుంది. అందులో ఈ నల్లమృగాలు యెక్కువగా దొరుకుతాయి. దీని మాంసం బాగా రుచిగా వుంటుంది."

నిండుగా ఆహారం తీసుకోవటంతో అందరికీ నిద్ర ముంచుకు వచ్చింది. కళ్ళు చిన్నగా మూతలు పడుతున్నాయి.

నాయకుడు ఆండ్రూస్‌తో ఏదో చెప్పాడు.

"మీరు అలసిపోయి వున్నారేమో....విశ్రాంతి తీసు

కోమంటున్నాడు నాయకుడు. మీకోసం ఈ వెనుక వైపున మందనంలో వున్న ఇళ్ళలో పడకలు యేర్పాటు చేయబడ్డాయి" అన్నాడు ఆండ్రూస్.

అంతా లేచి నిలబడ్డారు.

నాయకుడు ఏదో చెప్పి వెళ్ళిపోయాడు తన ఇంట్లోకి.

నలుగురు మనుషులు వచ్చి తమ వెంట నడవమని సైగ చేశారు.

"విశ్రాంతి పొందండి. నేనూ వెళతాను. గుడ్ నైట్" అని వంకీ కర్ర సాయంతో నడుచుకుంటూ వెళ్ళిపోయాడు ఆండ్రూస్.

* * *

"ఆ మనుషులు భారత్ — సెల్లాలతో పాటు అందరినీ అక్కడినించి ఇళ్ళమధ్యనించి వెనుకవైపుకు తీసుకెళ్ళారు. ఆ వెనకవైపు విశాలంగా వున్న మైదానంలో వరుసగా చాలా ఇళ్ళు వున్నాయి. అన్నీ వెదురు ఆకులతో చేసినవే.

అక్కడక్కడ ఇళ్ళముందు పొడుగాటి గుంజలు భూమిలో పాతి వున్నాయి. వాటికి కాగడాలు కట్టి వున్నాయి.

కాగడాల వెలుగు రెపరెపలాడుతోంది ఆ ప్రాంతంలో. ఒక్కో ఇంట్లో యిద్దరు మనుషులు పడుకోవచ్చునని చెప్పారు వాళ్ళు. ఆ ఇళ్ళలోపల సన్నని ఆకులతో అల్లిన పెద్ద పెద్ద చాపలు పరిచివున్నాయి. తలగడలు లేవు. చలివేసినప్పుడు కప్పుకోటానికి చాపలపక్కనే పొడుగాటి జంతు చర్మాలు వేళ్లాడుతున్నాయి.

నాలుగో ఇంట్లో భారత్ — సెల్లా పడుకోవాలనుకున్నారు. ఆ పక్కనే వున్న ఇంట్లో ముగ్గురు స్త్రీలు

పడుకుంటూవున్నారు. మిగిలినవాళ్ళంతా వరుసగా వున్న ఇళ్ళలో—

ఆ మనుషులు వెళ్ళొస్తామని సైగ చేసి వెళ్ళిపోయారు. వెళ్ళిపోయేముందు ఇంటి తలుపులు గట్టిగా బిగించుకోమని చెప్పారు.

వాళ్ళు వెళ్ళిపోగానే అంతా యెవరి యిళ్ళలోకి వాళ్ళు వెళ్ళిపోయారు. చివరగా భారత్—సెల్లా తమ ఇంట్లో దూరారు.

లోపలకు వెళ్ళగానే తలుపును మూసి తాడుతో గట్టిగా కట్టేశాడు. రాత్రివేళ క్రూరమృగాలు వచ్చే అవకాశం వుంటుందని తలుపు బిగించుకోమని చెప్పారని అనుకున్నాడు.

సెల్లా అప్పటికే ఆ చాపమీద వాలిపోయింది. ఆ చాప అదోవిధమైన చిత్రమైన వాసన వేస్తోంది.

భారత్ ఆమె పక్కనే వచ్చి కూర్చుని సిగరెట్ టిన్ బయటకు తీశాడు. అప్పటివరకూ ఒక్క సిగరెట్ కూడా కాల్చనందుకు అతనికి ఆశ్చర్యమయ్యింది.

సెల్లాకూడా ఓ సిగరెట్ తీసుకుని "అంతా నీకేమని పిస్తోంది?" అన్నది.

"వింతగా వుంది. ఇంతకుముందు ఇలాంటి అనుభవాలను సినిమాల్లో చూశాను. కాని ఇప్పుడు ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాం. ఏమయినా మనం అదృష్టవంతులం. ఈ దీవిలో వున్న ఈ ఆటవికులు మంచివాళ్ళు. లేకపోతే మనందరినీ ఈ పాటికి ఆ దేవత విగ్రహానికి బలిచ్చి జాతర చేసేవాళ్ళు."

"నిజమే. ఏమయినా ఈ వాతావరణం యెందుకో

నాలో కలవరాన్ని కలగజేస్తోంది. అసలు ఆ ఆంద్రూస్ ఎవరు? ఇక్కడికి యెలా వచ్చాడు? ఎందుకు వచ్చాడు? ఈ దీవిలోనే ఎందుకు వుండిపోయాడు? ఈ దీవి నించి బయటపడే మార్గం లేకయేనా? ఒకవేళ అదే నిజమైతే యిప్పుడు మనం ఈ దీవినించి బయటపడటం కూడా అసాధ్యమేకదా?" అని అడిగింది.

పొగ పీలుస్తూ భారత్ మాట్లాడలేదు.

కొంచెంసేపు గడిచాక "ఏమో .... మనం యేమీ వూహించటానికి వీల్లేదు. ఆంద్రూస్ యే కారణాలవల్ల ఈ దీవిలో ఈ మొరటు మనుషులమధ్య వుండిపోయాడో మనకు తెలీదు. ఆయన తన చరిత్రను మనకు చెప్పలేదు. తర్వాత చెబుతానన్నాడు. ఆయన తన కధ చెప్పేవరకూ మనం ఏదీ అనుకోవటానికి వీల్లేదు. స్టెల్లా....అంతకంటే కూడా నన్ను మరో విషయం ఎక్కువ కలవరపెడుతోంది" అన్నాడు.

"ఏమిటి?" అతడి కళ్ళలోకి చూస్తూ అడిగింది.

"షాంకీల్‌ను భూమిలో పాతిపెట్టడం గురించి ఆంద్రూస్ చెప్పిన విషయం విన్నావు కదా? ఆ శవం గురించి ఈ మనుషులకు తెలిసిందంటే దారుణమయిన పరిస్థితులను యెదుర్కోవలసి వుంటుందని అన్నాడు. ఇప్పుడేమిటి చెయ్యటం? వాళ్ళే ఆ శవాన్ని పూడ్చిపెట్టిన విషయాన్ని గమనిస్తే అతిధ్యం మనకు ఇలా వుండదనుకుంటాను."

విచారంగా అన్నాడు భారత్.

"అవును. నిజమే. ఈ ఆటవికులందరికీ చాలా చిత్రమైన నమ్మకాలు వుంటాయి. లేకపోతే మరణించిన మనుషులను పూడ్చిపెడితే వాళ్ళు ప్రేతాత్మ గాల్లో తిరగటం

యేమిటి?? వీళ్ళందరినీ బాధించటం యేమిటి? బ్లయిండ్ బిలీఫ్.... రిడిక్యులస్" అన్నది.

భారత్ యేదో ఆలోచనలో వుండిపోయాడు.

చేతిలో వెలుగుతున్న సిగరెట్టు అయిపోయిన తర్వాత మరో సిగరెట్టును వెలిగించాడు.

అతనిలో ఆ క్షణాల్లో ఎన్నో రకాల ఆలోచనలు దొర్లిపోయాయి.

ఓవైపు—షాంకీల్ శవం.

మరోవైపు— తేజస్సును వెదజల్లే ఆ మణి.

అప్రయత్నంగానే అతని ఆలోచనలు ఎర్రని కాంతులను ప్రసరిస్తున్న ఆ మణి చుట్టూనే తిరుగుతున్నాయి.

కొంచెంసేపు అతడినే పరీక్షగా గమనించి "భారత్! యేమిటా ఆలోచన? ఆ మణి గురించేనా?" అన్నది సెల్లా.

అతను ఉలిక్కిపడి "నీకెలా తెలుసు!" అన్నాడు.

నవ్వింది సెల్లా—

"నీ ఆలోచనలు నాకు తెలీదా? వజ్రాలన్నా, మణులన్నా నీకెలాంటి ఇంట్రస్టు వుంటుందో నాకు తెలుసు. నేననుకుంటాను ఆ మణి విలువ మన నాగరిక ప్రపంచపు మార్కెట్‌లో కొన్ని కోట్ల రూపాయల వరకు వుంటుందని."

"యు ఆర్ రైట్....నా అంచనా కూడా అంతే. అసలు విలువకట్టటానికి వీల్లేని మణి. సృష్టిలో అపూర్వమైనది....కథల్లో వినటమే కాని చూడటం ఇదే మొదటిసారి. నాకు ఆలోచిస్తుంటే ఇప్పుడు అనిపిస్తోంది—ఒకరకంగా మన మంచికే ప్లేన్ ఈ దీవిలో కూలిపోయిందేమో!"

"మన మంచికే! అంటే?"

"ఇప్పుడు కాదు. తర్వాత చెబుతాను. పడుకో. బాగా పొద్దుపోయింది."

"నాకు నిద్ర రావటంలేదు" కొంటెగా చూస్తూ అన్నది.

"నాకు వస్తోంది."

"నీ పక్కనే పడుకున్నది ఓ ఆడది. అందాల రాసి."

"ష్! ఇక మాట్లాడకు" అంటూ శైలా మొహం మీదకు వంగి ఆమె పెదవులమీద బలంగా ముద్దు పెట్టుకున్నాడు.

అంతే. ఆవేశంగా అతడిని పెనవేసుకుపోయింది శైలా.

తాత్కాలికంగా వాళ్ళు పరిసరాలను అన్ని రకాల ఇతర ఆలోచనలను మరచిపోయి మరో లోకానికి వెళ్ళి పోయారు.

బయట కాగడాలు గాలికి కొట్టుకుంటూనే వెలుగు తున్నాయి.

దూరంగా దీవిలో ఎక్కడో ఏవో జంతువుల అరు పులు వుండుండి వినిపిస్తున్నాయి.

కొంచెంసేపట్లోనే భారత్—శైలా నిద్రలోకి జారి పోయారు. దాదాపుగా అంతా నిద్రాదేవి వొడిలోకి వెళ్ళిపోయారు. గూడెమంతా నిద్రలో జోగుతున్నట్టుగా వుంది.

• • •

ఎందుకో వున్నట్టుండి భారత్ కు చటుక్కున మెలకువ వచ్చింది. చివాలున చాపమీద లేచి కూర్చున్నాడు.

ఎందుకు మెలకువ వచ్చింది?

చెవులు రిక్కించాడు.

ఎవరో ఏడుస్తున్నారు....అవును. సందేహం లేదు. చాలా దగ్గర్నించి ఏడుపు వినపడుతోంది.

సెల్లాను చూశాడు. గాఢ నిద్రలో వుంది.

ఆమెను నిద్ర లేపుదామనుకున్నాడు. మళ్ళీ ఎందుకో లేపాలనిపించలేదు. అందుకే లేచి నిల్చున్నాడు.

తలుపుకు కట్టిన తాడును వూడదీసుకుని ఒక్కసారి అటూ ఇటూ చూసుకుని బయటకు వచ్చాడు. కొన్ని కాగడాలు ఆరిపోయి వున్నాయి.

కొంచెం దూరంలో రెండు కాగడాలు మాత్రం ఇంకా చిన్నగా వెలుగుతున్నాయి.

పక్కనే వున్న యింట్లోనించే ఆ ఏడుపు వినిపిస్తోందని అతనికి అర్థమైపోయింది. గబగబా అక్కడకు వెళ్ళి తలుపుదగ్గర నిలబడ్డాడు.

లోపల్నించి ఎక్కిళ్ళుపెట్టి ఓ స్త్రీ ఏడుస్తోంది. సన్నగా వినపడుతోంది. ఇంకో ఇద్దరు ఆమెను ఓదారుస్తున్నట్టుగా వుంది.

భారత్ ఆ తలుపుమీద అరచేత్తో చప్పుడు చేశాడు.

ఎవ్వరూ పలకలేదు.

"తలుపు తెరవండి.... నేను భారత్ ని."

రెండు నిముషాల తర్వాత తలుపు తెరుచుకుంది.

భారత్ లోపలకు అడుగుపెట్టాడు. అతడితోపాటు కాగడాల వెలుగు కూడా లోపల ప్రవేశించింది.

చాపమీద ఓ స్త్రీ కూర్చుని మోకాళ్ళమీద తల వుంచుకుని యేడుస్తోంది. మిగిలిన ఇద్దరు ఆమెను ఓదారుస్తున్నారు.

"ఏం జరిగింది?"

వెంటనే జవాబు రాలేదు.

మళ్ళీ అడిగాడు.

"భయంగా వుందిట. తనకు వున్న ఒకే ఒక్క చెల్లెలు గుర్తుకు వచ్చిందిట. ఆమెను చూడగలనో లేదో అని యేడుస్తోంది."

చెప్పారు వాళ్ళు.

వాళ్ళకీ యేడుపు వస్తున్నట్టుగానే వుంది. వాళ్ళ మొహాలు పాలిపోయి దీనంగా వున్నాయి.

వాళ్ళు తన గురించి చెబుతుంటే ఆ స్త్రీకి దుఃఖం మరింత పెరిగిపోయింది.

"ప్లీజ్! విచారపడొద్దు. తప్పకుండా మనం త్వరలోనే ఈ దీవినించి బయటపడతాం. మన గమ్యాలను చేరుకుంటాం. అధైర్యపడొద్దు. ఒక్కరు అధైర్యపడితే అందరిలోనూ పిరికితనం ప్రవేశిస్తుంది. అప్పుడు మనం ధైర్యంగా ముందుకు వెళ్ళలేము."

ఆమెకు ధైర్యం చెప్పాడు.

ఆ స్త్రీ యేడుపు ఆపేసింది.

కొంచెంసేపు అక్కడే కూర్చుని తర్వాత లేచి బయటకు వచ్చాడు.

కాగడాల వెలుగులో అతని నీడ యిళ్ళమీదకు పొడుగ్గా సాగుతోంది. వాతావరణం ప్రశాంతంగా వుంది.

నిశ్శబ్దంగా వుంది.

ఒంటరిగా నిల్చుండి ఆలోచనల్లో మునిగిపోయాడు భారత్. ఒకందుకు అతనికి విచారంగా వుంది.

ఒక విధంగా తమతో పాటుగా వీళ్ళంతా యీ

దీవిలో చిక్కుపడిపోవటానికి కారణం తను—స్టెల్లా....

ఆమె రివాల్వర్ తీసి పేల్చకుండా వున్నట్లయితే ప్లేన్‌లో కాల్పులు సంభవించి వుండేవి కాదు.

ప్లేన్ టాంకు అంటుకుని కూలిపోయేది కాదు. మండుతున్న ప్లేన్‌లోనించి సముద్రంలోకి దూకిన మనుషులు ఏమైపోయారో? బహుశ వాళ్ళు మరణించి వుండొచ్చు. ఒకవేళ బతికితే యిలాంటి యే దీవినో చేరుకుని వుండొచ్చు.

భారత్‌కు హటాత్తుగా కెరోన్ గుర్తుకు వచ్చింది.

కెరోన్! తనని నమ్ముకుని ప్రాణాలు పోగొట్టుకుంది.

నిజంగా కెరోన్ శాపమే తమని కష్టాలకు గురి చేస్తోందా?

ఉన్నట్టుండి యెక్కడో దూరంగా యేదో జంతువు ప్రాణభయంతో చేసిన ఆర్తనాదం వినిపించింది.

సరిగ్గా అప్పుడే స్టెల్లా తలుపు తెరుచుకుని బయటకు వచ్చింది.

అతడి దగ్గరగా వచ్చి భుజంమీద రెండు చేతులూ వేసి "ఎందుకిలా ఒంటరిగా చలిగాలిలో నిలుచున్నావ్?" అన్నది.

ఆ స్త్రీ యేడుపు గురించి చెప్పాడు.

"నిజమే. మగవాళ్ళే కొంతమంది దిగులుతో, భయంతో కుంగిపోతున్నారు. ఇలాంటి పరిస్థితులను స్త్రీలు తట్టుకోవటం సాధ్యం కాదు" అన్నది.

"నువ్వు మాత్రం ఆడదానివి కదూ" నవ్వుతూ అడిగాడు భారత్.

"కావచ్చు. కాని చిన్నతనం నుంచీ నేను మగవాడిగానే పెరిగాను. మగవాడితో సమానంగా అన్ని విద్య

లనూ నేర్చుకున్నాను. అందువల్ల నాకు గుండెధైర్యం ఎక్కువ."

"ఒప్పుకుంటాను. ఇంతకీ రేపటి మన కార్యక్రమం యేమిటి?"

"తెలీదు. ముందు మనం ఈ దీవి నుంచి బయటపడటం ఎలాగో ఆండ్రూస్‌ను అడిగి తెలుసుకోవాలి. ఎంత త్వరగా ఈ దీవినించి బయటపడితే అంత మంచిది. ఎందుకంటే ఈ మొరటు మనుషులు వాళ్ళ పిచ్చి నమ్మకాలతో, ఆచారాలతో మనల్ని వేధిస్తారు."

"నిజమే. నా మనసులో మరో భయంకూడా సుడులు తిరుగుతోంది. షాంకీల్ శవాన్ని ఈ మనుషులు తెలుసుకోరు కదా!"

"ఏమో! ఇక్కడ నిలబడి మనం యెన్నిరకాల ఆలోచనలు చేసినా అందువల్ల ఉపయోగం లేదు. ఇంత రాత్రి వేళ ఇలా బయటనిల్చుని మాట్లాడుకోవటం కూడా ప్రమాదమే. క్రూరజంతువులు సంచరిస్తూ వుంటాయి. లోపలకు వెళ్ళి పడుకుందాం" అంటూ అతడి చేతిని పట్టుకుని ఇంట్లోకి నడిచింది స్టెల్లా.

మౌనంగా ఆమెను అనుసరించాడు భారత్.

వాళ్ళు తలుపును బిగించి పడుకున్న కొంచెం సేపటికే ఆ ప్రాంతంలో పులి గాండ్రింపు వినిపించింది.

భయంతో ఒకరి నొకరు చూసుకున్నారు భారత్ — స్టెల్లా.

• • •

సూర్యోదయ మవుతుండగా అందరికీ మెలకువ వచ్చింది. అంతకు పూర్వమే కొంతమందికి మెలకువ వచ్చింది కాని కొంచెం సందడి మొదలయిన తర్వాతనే

బయటకు రావాలని లేవలేదు.

రాత్రి బాగా యేడ్చిన స్త్రీ కళ్ళు భాగము వుబ్బి పోవటాన్ని అంతా గమనించారు. అప్పటికప్పుడే ఆమె ఆ రాత్రి యేడ్చిన విషయం వాళ్ళందరికీ తెలిసిపోయింది.

అప్పుడు మగవాళ్ళు కూడా కొంతమంది వాళ్ళ మనసులో వున్న భయాన్ని, బాధను ఒకరికొకరు వ్యక్తం చేసుకున్నారు.

ముసలాయన గబగబా భారత్ దగ్గరకు వచ్చి "ఈ రోజు మనం ఈ దీవినించి బయటకు వెళ్ళగలమా?" అనడిగాడు.

ఆయనకు ఏమని జవాబు చెప్పాలో భారత్ కు అర్థం కాలేదు. తన చేతుల్లో యేముంది?

పదేపదే ఆయన అదే ప్రశ్నను అడగటంతో అతనికి విసుగు కలిగింది. కోపంకూడా వచ్చింది. అయినా ఎలాగో నిగ్రహించుకుని—

"ముందు మనం ఈ దీవినించి ఎలా బయటపడాలో ఆంద్రూస్ ను అడిగి తెలుసుకుందాం. తర్వాత ఆ విధంగా చేద్దాం. త్వరగా ఇక్కడినించి బయటపడాలని అందరికీ ఆదుర్దాగానే వుంది" అన్నాడు.

తర్వాత ఆయన చిన్నగా యేదో గొణుక్కున్నాడు.

ఆయన్ని చూస్తే వెంటనే భారత్ కి జాలి కలిగింది. అరవై యేళ్ళ పైనే వుంటాయి. నడిచే ఓపిక లేదు. చూపు కూడా సరిగా కనపడదు. అలాంటి మనిషికి కూడా ఎన్ని కష్టాలు?

మైగాడ్ ....ఏమి టీ పరిస్థితి??

అప్పటికే టకారా జాతివాళ్ళ గూడెంలో సందడి మొదలయ్యింది. నలుగురు మనుషులు వచ్చి వాళ్ళందరినీ

మళ్ళీ నాయకుడి ఇంటిదగ్గరకు తీసుకెళ్ళారు.

నాయకుడు ఇంటి బయటవున్న చెట్టుకింద తన సింహాసనంమీద కూర్చున్నాడు. ఆయన్ని చూడటంతోనే ముందుగా భారత్ వెనక్కు వంగి గాలిలో చేతిని వూపి అభివాదం చేశాడు. మిగిలినవాళ్ళంతా భారత్‌ను అనుకరించారు.

తన జాతి పద్ధతిలోనే వాళ్ళంతా తనకు గౌరవసూచకంగా అభివాదం చెయ్యటంతో నాయకుడికి పట్టరాని సంతోషం కలిగింది.

చేతులు వూపుతూ తన సంతోషాన్ని నవ్వుతో వ్యక్తపరిచాడు.

భారత్ దృష్టి దేవత విగ్రహం మెళ్ళో వున్న హారం మీద పడింది. అందులో వున్న మణి సూర్యుడి కాంతిలో అద్భుతమైన తేజస్సుతో ప్రకాశిస్తోంది.

దాన్ని చూడగానే అతని గుండెల్లో తిరిగి అలజడి మొదలయ్యింది.

మణి—కోట్లు విలువ చేసే మణి. దాని విలువ తెలియని మొరటు మనుషుల మధ్య ఓ విగ్రహం మెళ్ళో పడి వుంది.

పదేపదే ఆ మణి అతడిని ఆకర్షిస్తోన్నది....అతడిలో యెన్నో రకాల ఆలోచనలు కలుగజేస్తోంది.

అవును. ఎలాగైనా ఆ మణిని తన సొంతం చేసుకోవాలి. దాన్ని తను పొందాలి. ఎలాగైనా సరే. కాని ఇది సాధ్యమయ్యేదేనా? ఊహు....అసాధ్యం....

భారత్‌కు అప్రయత్నంగా నవ్వొచ్చింది.

ముందు తామంతా ఆ దీవినించి బయటపడే మార్గం వుందో లేదో తెలియకుండానే తను ఆ మణి గురించి

ఆలోచనలు చేస్తున్నాడు

సెల్లా ఆలోచిస్తోందా? ఈ మణి గురించి ...

ఏమో! అడిగితేనే కానీ తెలీదు.

బలవంతంగా మెదడులో రొద పెడుతున్న ఆలోచనలను పక్కకు నెట్టాడు.

ఎందుకంటే అప్పుడే వంకీ కర్రసాయంతో చిన్న చిన్న అంగలతో అంద్రూస్ అక్కడికి వచ్చాడు. వస్తూనే నాయకుడికి అభివాదం చేశాను.

తర్వాత భారత్‌తో కరచాలనం చేశాడు.

సెల్లాను చూసి చిరునవ్వు నవ్వుతూ "రాత్రి బాగా విశ్రాంతి తీసుకున్నారా?" అనడిగాడు.

తల వూపింది ఆమె.

"మీ తర్వాత ప్రోగ్రాం ఏమిటి?"

భారత్ నవ్వి "మా ప్రోగ్రాం అంటూ యేదీ లేదు. మాకు వున్న ఆలోచనల్లా ఒక్కటే. ఈ దీవినించి బయటపడి యెవరి గమ్యస్థానాలను వాళ్ళు చేరుకోవటం యెలా? ప్రస్తుతానికి యిదే ఆలోచన. ఇక్కడినించి బయటపడే మార్గాన్ని మీరు యిప్పుడు చెప్పగలిగితే మేమంతా యీ రోజునే మా ప్రయాణం మొదలు పెడతాం" అన్నాడు.

"అవును... మేమంతా దిగులుతో, భయంతో ప్రతి క్షణం కుమిలిపోతున్నాం. మమ్మల్ని ఈ దీవినించి బయటకు పంపించే మార్గం ఏదో చెప్పండి....ప్లీజ్ ...."

అంతా ఒక్కసారిగా అన్నారు.

ఓ. స్త్రీ రాత్రి మరో స్త్రీ నిద్ర పోకుండా ఏడ్చిన విషయం గురించి కూడా ఆయనతో చెప్పింది. ఆయన అంతా విని ఒకసారి తెల్లగా నెరిసిన గడ్డాన్ని చేత్తో

దువ్వుకుని—

చిన్నగా నవ్వాడు.

ఆ తర్వాత ఆండ్రూస్ మొహం గంభీరంగా మారి పోయింది. కొంచెం సేపు మౌనంగానే వుండి ఆ తర్వాత—

"ఇలా చెబుతున్నందుకు క్షమించండి. అసలు ఈ దీవి యే ప్రాంతంలో వున్నదో, ఇక్కడినించి బయలుదేరితే యెక్కడికి వెళతామో నాకు యింతవరకు తెలీదు. నాకే కాదు. ఈ దీవిలో యెవ్వరికీ తెలీదు" అన్నాడు.

ఆ మాటలు వినగానే ఒక్కసారిగా అంతా మృత్యువును చూసినవాళ్ళలా కదిలిపోయారు. ఆండ్రూస్ మాటలు వాళ్ళ మెదడులోకి విషబాణాల్లా దూసుకు పోయాయి. ఒక్కక్షణం వాళ్ళకు మృత్యువు వొడిలోకి వెళ్ళిపోతున్నట్టు అనిపించింది.

ఈ దీవి ఎక్కడ వున్నదో, యిక్కడినించి బయట పడితే యెక్కడికి వెళతారో యెన్నో యేళ్ళనించి ఆ దీవిలో ఉంటున్న ఆండ్రూస్‌కే తెలీదా?

అసలు ఆ దీవిలో ఎవ్వరికీ తెలీదా?

ఇది నిజమా?

ఇదే నిజమైతే తమ గతి యేమిటి? తమ కేమిటి దారి? శాశ్వతంగా ఆండ్రూస్‌లాగే అంతా ఆ దీవిలోనే గడ్డాలు పెంచుకొని మొరటు మనుషుల్తో కలిసిపోయి జంతుచర్మాలు కట్టుకుని వాళ్ళలాగే జీవించాలా?

లేక దిగులుతో చచ్చిపోవటమా?

ఏమిటి? ఏమిటి?

భారత్—ఆండ్రూస్‌ను యేదో అడగటానికి నోరు తెరిచాడు. కాని అతడికి ఆ అవకాశం లేకుండా పోయింది,

ఉన్నట్టుండి ఆ స్త్రీ పెద్దగా రోదించటం మొదలు పెట్టింది. ఉలిక్కిపడ్డాడు భారత్.

ఆంద్రూస్ చివుక్కున ఆమెవైపు తిరిగి "ఎందుకు ఏడుస్తోంది?" అన్నాడు.

సెల్లా అన్నది, "ఆమే రాత్రి కూడా యేడ్చింది. ఆమెకు భయంగా వుందిట. మీకు ఈ దీవినించి బయట పడటం యెలాగో తెలియదని చెప్పటంతో అప్‌సెట్ అయ్యింది."

నాయకుడికి ఈ గొడవేమిటో అర్థం కాలేదు. కిచకిచ లాడుతూ ఆంద్రూస్‌ను యేదో అడిగాడు. అందుకు ఆంద్రూస్ ఆ బృందానికి వచ్చిన సమస్య గురించి చెప్పి వాళ్ళంతా దిగులుపడుతున్నారని అన్నాడు.

నాయకుడు విచారంగా మార్చాడు వదనాన్ని. వెంటనే యేదో అన్నాడు.

సెల్లా మిగిలిన ఇద్దరు స్త్రీలు ఆ యేడుస్తున్నామెను ఓదార్చారు.

"దిగులుపడకు. ఏదో ఒక మార్గంతో మనం తప్పకుండా ఈ దీవినించి బయటపడతాం. మనందరం ఎంతో ప్రశాంతంగా యీ సమస్యను గురించి ఆలోచించాలి. దిగులు, ఏడుపు, భయం సమస్యలకు పరిష్కారం ఎప్పటికీ కాదు...."

ఇలా చెబుతూ ఆమె యేడుపును కొంతవరకు అరికట్టగలిగారు.

"ఏమిటి నాయకుడు అంటున్నాడు?" భారత్— ఆంద్రూస్‌ను అడిగాడు.

ఆంట్రూస్ తల ఎగరేసి "నాయకుడు కూడా యిదే అంటున్నాడు. తను ఈ దీవిలో పుట్టాడట. ఈ దీవిలోనే

పెరిగాడట. కాని యెప్పుడూ ఈ దీవిని వదిలి పోలేదట. అప్పుడప్పుడు యెవరైనా విధివశాత్తూ ఈ దీవికి వచ్చిన మనుషులు కూడా బయటపడాలనే ప్రయత్నాలు చేసినా వాళ్ళ శవాలు సముద్రంలో తేలుతూ ఈ దీవికే కొట్టుకు వచ్చాయట. ఇతర దీవులతో ఈ దీవికి యెలాంటి సంబంధాలు లేవు. అందుకే ఈ దీవిలోని టకారాజాతి మనుషులంతా యెంతో నిర్భయంగా జీవిస్తున్నారు. మరో దీవి జాతులతో వైరం యేర్పడే అవకాశం లేదు. వాళ్ళు దండెత్తి వస్తారనే భయం లేదు" అని చెప్పాడు.

ఆయన చెప్పిన సుదీర్ఘమైన ఉపన్యాసం విన్నేసరికి అందరికీ నిస్సత్తువ ఆవహించింది. బ్రతుకుమీద ఆశ ఎగిరి పోయింది. తమ చావు షాంకీల్ చావులాగే ఆ దీవిలోనే రాసిపెట్టి వుందని యెంతో గట్టిగా అనుకున్నారు.

ఒక్కసారి భారంగా నిట్టూర్చాడు భారత్. అందరి మొహాల్లోకీ చూశాడు. పాలిపోయి వున్నాయి. జీవకళ లేదు. అందరిలోనూ మృత్యు భయమే కనిపిస్తోంది.

ముసలాయన వణికిపోవటాన్ని గమనిస్తే భారత్ కు జాలి కలిగింది. ఆయన యేదో మాట్లాడాలని ప్రయత్నం చేస్తున్నాడు కాని మాట్లాడలేకపోతున్నాడని గ్రహించాడు. మిగిలిన అందరి పరిస్థితి కూడా దాదాపు అట్లాగే వుంది.

చివరగా ఆంద్రూస్ ను చూశాడు మళ్ళీ.

భారత్ చూపులోని ఆంతర్యాన్ని గ్రహించినట్టు "ఐయామ్ సారీ భారత్ .... వెరీసారీ వెరీ.... నేను చెప్పిన ఈ కఠోర నిజం మీ అందరి గుండెలమీదా చావుదెబ్బ కొట్టివుంటుందని నాకు తెలుసు. ఐనా తప్పదు. నేనెలా మిమ్మల్ని మభ్యపెట్టేది? నిజం ముందుగా తెలిస్తే మీరు

గుండె రాయి చేసుకుని బతుకుతారు. ఇన్నేళ్ళుగా నేను ఈ దీవిలోనే యెందుకు వుండిపోయానో ఇప్పటికైనా అర్థమయ్యిందా? కొన్నేళ్ళు ఈ జీవనానికి అలవాటు పడిన తర్వాత యేదో విధంగా రిస్కు తీసుకుని బయటకు వెళ్ళిపోవాలనే ఆలోచన నశించిపోతుంది...దట్సాల్" అన్నాడు అతని భుజంమీద చిన్నగా తడుతూ.

నాయకుడు మౌనంగా అందరి ముఖకవళికలనూ గమనిస్తూ సింహాసనంమీద కూర్చుని వున్నాడు. అయితే అతనికి చీమ కుట్టినట్టు కూడా అనిపించలేదు.

టకారాజాతి మనుషులు చిన్నగా అప్పుడప్పుడు నాయకుడిని ఏవో గుసగుసగా అడుగుతున్నారు. నాయకుడు చిన్నగానే వాళ్ళకు జవాబులు చెబుతున్నాడు.

ఎండెక్కుతోంది. సూర్యుడు ఆకాశంమీద జరజరా పాకుతున్నాడు.

స్టెల్లాకు కూడా ఆ పరిస్థితిలో ఎలా మూవ్ కావాలో అర్థం కాలేదు. ఆ బృందం మొత్తంలో భారత్—స్టెల్లా ఆ యిద్దరే యిద్దరు కొంచెం ధైర్యంగా వున్నారు. మిగిలిన అందరూ జారిపోయిన గుండెలతో జీవచ్ఛవాల్లా నిలబడి వున్నారు.

అంతటా మౌనమే చోటు చేసుకుని వుంది.

దాన్ని ఛేదిస్తూ "ఒకసారి ఈ దీవినిచూసి వస్తారా?" అడిగాడు ఆండ్రూస్.

వెంటనే ఎవ్వరూ మాట్లాడలేదు.

భారత్ తల పైకెత్తి చూసే కాంతులను వెదజల్లుతున్న మణి కనిపించింది. ఆ దేవత విగ్రహం భయానకంగా వుంది. పెద్ద పెద్ద కనుగుడ్లు—బయటకు పొడుగ్గా సాగిన ఎర్రని నాలుక—దానికి రెండువైపులా పొడుగాటి

తెల్లని కోరలు.... చేతుల్లో ఈ టెల్లాంటి ఏవో ఆయుధాలు. ఎంతో యెత్తుగా వుంది. కొండలో తొలచిన ఏకశిలా విగ్రహంలా వుంది. మెళ్ళో గుండెల మధ్య వేల్లాడుతున్న హారంలో ఆ అద్భుత మణి....

ఊహు....తప్పదు. ఏదో మార్గం అన్వేషించాలి.... ఆ మణితో ఈ దీవినించి పారిపోవటంకోసమైనా సరే యిక్కడినించి బయట ప్రపంచానికి వెళ్ళే దారిని వెతకాలి....

దృఢంగా అనుకున్నాడు.

"డియర్ ఫ్రెండ్ .... ఈ దీవిని ఒకసారి చూస్తారా?" ఆంద్రూస్ మళ్ళీ అడిగేసరికి భారత్ తన ఆలోచనలనించి బయటపడి తల వూపాడు.

"ఈ దీవిలో ప్రతి నిమిషం ప్రమాదంతో కూడుకుని వుంటుంది. ఏ వైపునించి ప్రమాదం ఏ జంతువు రూపంలో వస్తుందో తెలీదు. అలాంటి ప్రమాదాలను ఎదుర్కోగల మనే ధైర్యం వుంటేనే దీవి లోపలకు వెళ్ళండి. మీరు లోపలకు వెళుతున్న మార్గాన్ని జాగ్రత్తగా గుర్తుంచుకోండి. వీలయితే ఏవయినా గుర్తులు పెట్టుకోండి. లేకపోతే తిరిగిరావటం కష్టం."

ఆంద్రూస్ అలా అనేసరికి భారత్ — స్టెల్లా తప్పించి మిగిలినవాళ్ళు "వద్దు....అనుక్షణం ప్రమాదం ఎదురైతే మేము ఎదుర్కోలేము" అన్నారు.

స్టెల్లా అన్నది "ప్రస్తుతం మనం ప్రమాదంలోనే వున్నాం. ఈ దీవినించి బయటపడే అవకాశం ఇక యెలాంటి పరిస్థితులలోనూ వుండదని నిర్ధారించుకున్న తర్వాత ఇక్కడే ఈ జాతి మనుషుల్లాగే అనుక్షణం ప్రమాదాలను ఎదుర్కొంటూ బతకాలి. అటువంటప్పుడు

ప్రమాదానికి భయపడి యిక్కడే గోళ్ళు గిల్లుకుంటే దిగులుతో భయంతో కుంచించుకుపోతూ కూర్చునేకంటే అలా బయట తిరిగిరావటమే మంచిది."

ఆ తర్వాత యెవ్వరూ మాట్లాడలేదు.

భారత్ అన్నాడు, "ఈ ముగ్గురు ఆడవాళ్ళు మన ఓల్డుమాన్ ఇక్కడే వుంటారు. మిగిలిన అందరం బయటకు వెళదాం."

సరేనన్నారు.

ఆంద్రూస్ నాయకుడితో యేదో చెప్పాడు. నాయకుడు నలుగురు మనుషులను పిల్చి కిచకిచ లాడాడు.

వాళ్ళు అక్కడినించి వెళ్ళిపోయారు.

ఆంద్రూస్‌తో యేదో చెప్పాడు నాయకుడు.

తల వూపాడు ఆంద్రూస్.

"ఏమిటి? మా గురించేనా?" భారత్ అడిగాడు.

నవ్వి "అవును. నల్లమృగాలు దొరికితే వేటాడి తీసుకు రమ్మంటున్నాడు. నల్లమృగాల మాంసమంటే ఈ టశారా జాతివాళ్ళకు ప్రాణం. వీలు కుదిరి అవి దొరికితే తీసుకురండి. నాయకుడు సంతోషపడతాడు" అన్నాడు ఆంద్రూస్.

ఇంతలోనే వెళ్ళిన నలుగురు మనుషులూ కొన్ని బల్లేలూ, కత్తులతో తిరిగివచ్చారు. వాటిని భారత్— టైలా మిగిలిన వాళ్ళకిచ్చారు.

"ఆయుధాలతోనే దీవి లోపలకు వెళ్ళడం క్షేమకరం. మీదపడే జంతువులతో పోరాడవచ్చు. ఇక వెళ్ళి రండి. కొంతవరకు ఈ జాతిమనిషి మీకు తోడుగా వస్తాడు."

స్త్రీలను ముసలిమనిషిని అక్కడే వదిలి మరోసారి ఆంద్రూస్ కు, నాయకుడికి చెప్పి అక్కడినించి కదిలాడు భారత్. మిగిలినవాళ్ళంతా అతడిని అనుసరించారు. టకారాజాతి మనిషి ఆంద్రూస్ యేదో చెప్పగానే వాళ్ళతో కలిసి బయల్దేరాడు.

ఇళ్ళముందునించి వాళ్ళంతా నడిచి వెళుతుంటే టకారా జాతి పిల్లలు వింతగా చూశారు. పిల్లలు దాదాపుగా భారత్ — సెల్లాల ఎత్తులో వున్నారు. వాళ్ళ పాదాలు కూడా బాగా వెడల్పుగా వున్నాయి.

• • •

పొడుగాటి చెట్ల మధ్యనించి నడుస్తున్నారు. ఎండ చెట్లకొమ్మల మధ్యనించి చీల్చుకుని భూమ్మీదకు పడుతోంది.

ఎవరికివారే ఆలోచనల్లో మునిగిపోయి చాలా యాంత్రికంగా నడుస్తున్నారు. వాళ్ళందరి చేతుల్లోనూ వున్న ఆయుధాలు బరువుగా అనిపించాయి.

బల్లేలు వాడిగా మొనతేలి వున్నాయి. ఏ జంతువు మీదకైనా గురిచూసి విసిరితే దాన్ని చీల్చుకుని లోపలకు వెళ్ళిపోయేట్టుగా వున్నాయి. కత్తులు వంపు తిరిగినాయి.

టకారాజాతి మనిషి బల్లాన్ని వూపుకుంటూ నడుస్తున్నాడు. అతడి ఆకారాన్ని చూస్తుంటే అతడు మనుషులను అమాంతం విరుచుకుతినే రాక్షసుడిలా అగుపించాడు. అతను సెల్లా పక్కగా వచ్చాడు. ఒక్కసారిగా గుప్పుమని వెగటువాసన కొట్టింది ఆ వాసనను భరించలేకపోయింది ఆమె. అయినా తప్పలేదు. తన నడక వేగాన్ని తగ్గించింది. అతడు క్షణంలో ఆమెను

దాటి ముందుకు వెళ్ళిపోయాడు.

పొడుగాటి చెట్లు ఆగిపోయాయి. చిన్న చిన్న పొదలు మొదలయినాయి. అక్కడినించే కొత్తదారి మొదలయ్యింది.

రాత్రి వాళ్ళు వచ్చిన దారి కాదు అది. ఆ దారి ఎక్కడికి వెళుతుందో తెలీదు. దూరంగా మళ్ళీ పొడ వాటి చెట్లు కనపడుతున్నాయి.

"ఎంత దూరం యిలా?" యెవరో అడిగారు వున్నట్టుండి.

"తెలీదు. ముందు మనం యిక్కడనించి బయటపడే దారి తెలుసుకోవాలంటే ఈ దీవి గురించి కొంతవరకైనా తెలుసుకోవాలి. అందుకోసమే ఆండ్రూస్ దీవిని చూసారా? అని అడిగినప్పుడు నేను తల వూపాను" భారత్ చెప్పాడు.

చిన్న పొదలు కూడా అంతమయ్యేటప్పుడు పొడువాటి చెట్ల మధ్యనించి ఇద్దరు టకారా జాతి మనుషులు వాళ్లకు ఎదురొచ్చారు. వాళ్ళ చేతుల్లో బల్లేలతోపాటుగా రెండు నల్లటి జంతువులు కూడా కనిపించాయి.

దగ్గరగా వచ్చిన తర్వాత ఆగిపోయారు.

అప్పుడు పరీక్షగా చూసి అవే ఆండ్రూస్ చెప్పిన నల్లమృగాలు అయివుంటా యనుకున్నారు.

బల్లేలు కడుపులో దిగబడ్డాయేమో! నెత్తురు బొట్లు బొట్లుగా కారుతోంది. వాటి చెవులు పొడుగ్గా వున్నాయి. కొమ్ములు లేవు. వాటి కాళ్ళు తీగలతో కట్టి బల్లేలకు వేలాడదీసి భుజాలమీద పెట్టుకున్నారు.

వాళ్ళు భారత్ వాళ్ళతో వస్తున్న టకారా జాతి మనిషితో యేదో మాట్లాడారు.

వాడు యేదో చెప్పాడు.

వాళ్ళేదో అన్నారు నవ్వుతూ పిల్లాని చూస్తూ.

వాడు కూడా పిల్లావైపు అదోలా చూసి యేదో చెప్పాడు. తర్వాత ముగ్గురూ నవ్వుకున్నారు వికృతంగా నోర్లు తెరిచి.

వాళ్ళంతా గమనిస్తూనే వున్నారు ఆ ముగ్గురి మాటలు—ప్రవర్తన.

పిల్లా కూడా చూస్తోంది. కాని వాళ్ళు తన గురించే మాట్లాడుకుంటున్నారని తెలిసినా యేం మాట్లాడుకుంటున్నారో అర్థం కాలేదు. వాళ్ళ భాష తనకు తెలియనందుకు బాధపడింది.

ఇదంతా చూసి భారత్ ఆ మనిషితో "ఇక మేం వెళతాము. నువ్వు వెనక్కి తిరిగి వెళ్ళిపో" అని సైగలతో చెప్పాడు.

వాడు కొంచెంసేపు మౌనంగా చూసి తర్వాత సరేనన్నట్టు తల వూపాడు. వాళ్ళు బయల్దేరుతుంటే జాగ్రత్త అన్నట్టుగా చెప్పి నల్లమృగాలు దొరికితే తీసుకురమ్మని సైగలతోనే చెప్పాడు బల్లెలకు వేల్లాడుతున్న నల్ల మృగాలను చూపి.

తల వూపాడు భారత్.

ఆ ముగ్గురూ వెళ్ళిపోయారు.

నడుస్తూ "వాళ్ళు నా గురించే మాట్లాడుకున్నారని తెలిసింది. కాని ఏం మాట్లాడుకుని వుంటారో వూహించలేకుండా వున్నాను" అన్నది పిల్లా భారత్ తో.

"దేని గురించో యెందుకు? నీ అందం గురించే ఐవుంటుంది."

"ఈ మొరటు మనుషులకు అందం గురించి కూడా

తెలుసా?" హేళనగా అన్నది.

"ఏమో.... తెలీదు. ఇక మనం శాశ్వతంగా ఈ దీవిలోనే వుండిపోవలసివస్తే అప్పుడు ఈ టరారా జాతి వాళ్ళ కిచకిచల భాష నేర్చుకోక తప్పదు. అప్పుడు తెలుస్తుంది నీకు ఈ మొరటు మనుషులు మన గురించి ఏం మాట్లాడుకుంటారో?"

"వద్దు భారత్. పొరపాటున కూడా నువ్వు ఇలాంటి మాటలు అనొద్దు. మనం శాశ్వతంగా ఈ దీవిలోనే వుండిపోతామనే ఆలోచననే రానీయకు. ఏదోవిధంగా ఇక్కడినించి బయటకు వెళ్ళటం జరిగితీరాలి. మనం కృషిచేస్తే అందుకు మార్గం దొరక్కుండా వుండదు."

"నా ఉద్దేశంకూడా అదే! అందుకే మిగిలినవాళ్ళలా నేనూ ఆండ్రూస్ మాటలు విని కొంత నిరుత్సాహపడినా పూర్తిగా నీరసించిపోలేదు. మండుతున్న విమానం కూలిపోయినా మనం ప్రాణాలతో మిగిలిపోయామంటే తప్పకుండా మనం మన గమ్యస్థానాలను చేరుకుంటామనే అనిపిస్తోంది. అవును కదూ?" అడిగాడు.

స్టెల్లా తల వూపిందికాని మిగిలిన వాళ్ళు మాట్లాడలేదు. ఎందుకో ఎంత ప్రయత్నంచేసినా వాళ్ళందరికీ నమ్మకం కలగటంలేదు. అక్కడినించి బయటపడతామనే ఆశ పూర్తిగా అడుగంటిపోయింది ఆ దీవినీ, ఆ మనుషులను చూస్తుంటే.

ఎండ కాల్చేస్తోంది. వేడిగాలి సెగలు కక్కుతోంది. ఆ దీవి వాతావరణ పరిస్థితి చాలా వింతగా అనిపించింది. పగలంతా సెగలు కురిపించే వేడిగాలి చీకటి పడగానే వణుకు పుట్టించే చల్లని చలిగాలి.

పొదలు అంతరించి పోయాయి.

తిరిగి పొడుగ్గా వున్న చెట్లలోకి ప్రవేశించారు. ఐతే ఈ చెట్ల ఆకులు వెడల్పుగా కాకుండా పొడుగ్గా సన్నని చివర్లు కలిగివున్నాయి. గాలికి ఆకు రాలి ఎవరిమీదైనా పడితే అది శరీరంలోకి దిగిపోయేలా వుంది.

ఆకులు రాలి గుట్టలుగా కిందపడి వున్నాయి.

ఎండిపోయిన ఆకులమీదనించి నడుస్తుంటే గలగలమని చప్పుడవుతోంది.

నడుస్తున్నదల్లా ఆగి వొంగి కిందనించి ఓ ఆకును చేతికి తీసుకుంది స్టెల్లా. ఆ ఆకును పరీక్షగా చూసింది. యూకలిప్టస్ ఆకులా వుంది. కాని ఇంకా పొడుగ్గా వుంది. దాని చివర సన్నని ముల్లులా వుంది గట్టిగా.

"చిత్రమైన ఆకు.... ఇలాంటి చెట్లను ఇంతకుముందు ఎప్పుడూ చూళ్ళేదు" అన్నది స్టెల్లా.

"అసలు ఈ దీవే చిత్రమైనదిగా వుంది. విషంతో నిండిన పండ్లున్న చెట్లు.... ముల్లు వున్న ఆకులు.... ఆకలిని రెట్టింపు చేసే పండ్లు.... ఇంకా ఇలాంటి వింతలు ఈ దీవిలో ఎన్ని వున్నాయో."

దట్టంగా పరుచుకుని వున్నాయి చెట్లు. ఎండ లోపలకు పడటంలేదు. చల్లగానే వుంది.

"ఇంకా ఎంత దూరం?" నలభై యేళ్ళు దాటుతున్న ఓకాయన అడిగాడు.

"సముద్రం వచ్చేవరకూ నడవాలి. అక్కడకు వెళితే మనకు ఓ ఐడియా అంటూ కలుగుతుందని నా ఉద్దేశం" భారత్ చెప్పాడు.

అందరికీ అసహనంగా వుందని అతడికి తెలుసు. ఐనా తప్పదు. సంఖ్యాబలం తప్పకుండా అవసరం. కలిసికట్టుగా వుంటేనే ఆ దీవినించి బయటపడటానికి కొంచె

మైనా అవకాశం వుంటుంది. ఓ ప్రమాదాన్ని యెదుర్కోవటానికైనా ఎక్కువమంది మనుషులవసరం తప్పదు. అందుకే అందరికీ ధైర్యం చెప్పటం వాళ్ళు నిర్వీర్యులై పోకుండా చూడటం.

పెద్ద గాలి వీచింది. ఆ చెట్ల ఆకులు రాలాయి.

ఒక ఆకు విసురుగా వచ్చి ఒక వ్యక్తి మెడమీద పడింది.

కెవ్వున అరిచాడు అతను—బాధతో అక్కడే కూలబడిపోయాడు. మెడమీద పొడుగాటి ఆకు దిగబడిపోయి అలాగే వుండిపోయింది.

వెంటనే స్టెల్లా ఆ ఆకును లాగేసింది.

అతని మెడమీదనించి నెత్తురు చివ్వున బయటకు చిమ్మింది. నెత్తురు రాకుండా వేలితో గట్టిగా నొక్కిపట్టింది.

ఆ వ్యక్తి గిలగిల్లాడిపోయాడు.

"ఎలా వుంది?"

"మంటగా వుంది. కత్తి దిగినంత బాధగా వుంది."

అంతా భయంగా తలలు పైకెత్తి ఆ చెట్లకేసి చూశారు. ఆకులు కత్తుల్లా వూగుతున్నాయి గాలికి.

"ఎక్కువసేపు మనం ఈ చెట్లకింద నడవటంకూడా మంచిది కాదు. వేగంగా నడవండి. అదిగో ఇంకొంచెం దూరంలోనే ఈ కత్తుల చెట్లు అంతమవుతున్నాయి. ఈ చెట్లు దాటితే మనకు ఈ భయం వుండదు."

అతను లేచి నిలుచున్నాడు. అంతా పెద్ద పెద్ద అంగలు వేస్తూ నడక మొదలుపెట్టారు.

* * *

కొంచెం దూరం నడిచేసరికి ముందు నడుస్తున్న స్టెల్లా

ఆగిపోయింది.

"ఏమిటి?" అడిగాడు భారత్.

కొంచెం దూరంలో ఆకులమధ్య తల పైకెత్తి జరజర పాకివస్తున్న ఆ ప్రాణిని చూడగానే సెల్లా కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి.

నిశ్చయంగా అది పాము! కాని దాని రంగు నీలిరంగు. దాని తల చాలా లావుగా వుంది. తలమీద బుడిపెలాంటిది వుంది. దాన్లోంచి ఏదో ముల్లులాంటిది బయటకు పొడుచుకు వచ్చింది.

సెల్లా అదేమిటో చెప్పకముందే వాళ్ళంతా ఆ పామును చూసి భయంతో కొయ్యబారిపోయారు.

వాళ్ళకు కొంచెం దూరంలో వచ్చి ఆగిపోయింది ఆ నీలిపాము. పడగవిప్పి బుసకొడుతూ కళ్ళను అటూ ఇటూ తిప్పుతూ చూస్తోంది.

స్నేక్ పార్కులో ఎన్నో రకాల పాములను చూశాడు భారత్. మిగిలిన వాళ్ళు కూడా చూశారు. కాని అలాంటి నీలిరంగు పామును ఇంతవరకు యెవ్వరూ, యెప్పుడూ చూడలేదు.

అది తోకను పైకి లేపుతూ అటూ ఇటూ ఆకులమీద కొరడాలా కొడుతోంది. చప్పుడవుతోంది.

అంతా నిశ్చేష్టులై విగ్రహాల్లా నిలబడిపోయారు వూపిరి పీల్చటంకూడా మరచిపోయి.

ఆ నీలిరంగు పాము సెల్లా ఎదుర్కోవటం?

దారికి అడ్డుగా వుండిపోయింది. దాని బుసపెట్టే శబ్దం వింటుంటే గుండెలు అదురుతున్నాయి.

టెన్షన్. దాన్ని భరించటం కష్టంగా వుంది.

పాము అక్కడనించి కదల్లేదు. పడగవిప్పి ప్రతి

సికనుకూ దాన్ని కదిలిస్తూ చూస్తోంది.

"భారత్" పిల్చింది స్టెల్లా.

"ఈ పాము ఓర్పు చూస్తుంటే ఇది చీకటిపడేవరకూ ఇలాగే వుండిపోయేలా ఉంది. దీనికి భయమంటే ఏమిటో ఇప్పటివరకూ తెలిసినట్టులేదు. ఈ వంకీ కత్తులతో, బల్లెలతో ఇలాంటి పాములను ఎదుర్కోవటం టకారజాతి మనుషులకు సాధ్యమేమోకాని మనకు సాధ్యంకాదు. రివాల్వర్‌తో షూట్ చెయ్యవచ్చు. కాని ఈ పాము కోసం ఓ బుల్లెట్‌ను వృథాపరిచటం నాకిష్టంలేదు. అందుకే నాకో ఆలోచన వచ్చింది."

"ఏమిటా ఆలోచన?"

చెప్పింది స్టెల్లా.

కొంచెం పక్కకు జరిగింది స్టెల్లా. పాము దృష్టి స్టెల్లామీదకు డైవర్టు అయ్యింది. ఒకరి పక్కన ఒకరు నిల్చుని ఉన్నారు.

చిన్నగా వంగాడు భారత్.

గాస్ లైటర్‌తో కింద వున్న ఎండుటాకులను అంటించాడు. బాగా ఎండి వున్న ఆకులు వెంటనే అంటుకున్నాయి.

లేచి నిల్చున్నాడు.

చిటపటలాడుతూ తృణాలమీద ఆకులు అంటుకుని మంట పైకిలేచింది.

అంతా పక్కకు తప్పుకున్నారు. వేడి తగులుతోంది. గాలి సన్నగా వీస్తోంది పామువైపుకే.

ఉలిక్కిపడింది నీలిరంగు పాము.

కళ్ళు మరింత పెద్దవిచేసి ఎర్రగా పైకిలేస్తూ ముందుకు నాసుకు వస్తున్న మంట కనిపించింది.

ఇప్పుడు మనుషులకూ పాముకూ మధ్యగా మంట వచ్చేసింది. ఆకులు మండుతున్నాయి. గాలి మంటను పామువైపుకు నెట్టుకు వెళుతోంది.

ఒకే ఒక్క క్షణం.

వూహించని వేగంతో పాము వెనక్కు తిరిగింది. జరజరా పాకుతూ క్షణాలో ఆకులకిందనించి వెళ్ళిపోయింది.

"గ్రాండ్ సక్సెస్. నీ తెలివి అమోఘం" అన్నాడు భారత్. మిగిలిన వాళ్ళుకూడా శిల్లాను మెచ్చుకున్నారు.

తిరిగి మంటపక్కనించే ముందుకు వెళ్ళిపోయారు.

కత్తుల చెట్లు అంతమైపోయాయి.

మామూలు చెట్లు పొదలు ప్రత్యక్షమైనాయి

అన్నీ చిన్న చిన్న చెట్లు. దగ్గరగా వున్నాయి. అంతా అడవిలా వుంది. చెట్లకు తీగలు అల్లుకుపోయాయి.

"ఈ అడవిలో మృగాలు ఉంటాయేమో" అన్నది శిల్లా.

"వుండొచ్చు. అందుకే మనం ప్రతిక్షణం జాగ్రత్తగా ఉండాలి."

"ఇంకెక్కడ సముద్రం? నడిచీ నడిచీ కాళ్ళు లాగుతున్నాయి."

"ఆకలిగా వుంది. నిన్న సాయంత్రం కనిపించిన చిన్న పండ్ల చెట్లు కనపడలేదు."

ఇలా మాట్లాడుకుంటూ నడుస్తున్నప్పుడు కొంచెం దూరంనించి సముద్రపు హోరు వినిపించింది.

"అదిగో సముద్రం" అరిచారు ఎవరో.

"అవును. అది తప్పకుండా సముద్రం హోరు. చల్లటి గాలికూడా వీస్తోంది. మనం సముద్రానికి చేరువలోకి

వచ్చాము."

మరో పది నిమిషాలకు వాళ్ళకు సముద్రం కనపడింది. పొంగి పొర్లుతోంది.

అక్కడికి దగ్గరిలోనే వుంది.

అలల మీదనించి వస్తున్న గాలి చల్లగా వుంది. సముద్రాన్ని చూడటంతోనే వాళ్ళందరికీ ఉత్సాహం, సంతోషం కలిగినా వెంటనే ఆ సముద్రాన్ని దాటి వెళ్ళటం ఓ సమస్య అనే విషయం గుర్తొచ్చి అంతు లేని నిరుత్సాహం కూడా కలిగింది.

ఇంకొంచెం ముందుకు నడిచారు.

సముద్రానికి చేరువగా వెళ్ళి నిలబడ్డారు.

గంభీరంగా ప్రవహిస్తోంది. కనుచూపుమేరలో అంతా సముద్రమే. తెల్లగా అగుపడుతోంది. ఎక్కడో దూరంగా మరో దీవి ఉన్నట్టు కాని—చెట్లు కాని కని పించటంలేదు.

ఆకాశంలోకి చూశాడు భారత్. సముద్రంమీదుగా ఎక్కడైనా పక్షులు కనపడతాయేమోనని.... ఊహు.... ఒక్క పక్షీకూడ కనపడలేదు.

అంటే ఆ దరిదాపుల్లో యెక్కడా భూమి లేదన్న మాట. అంతేకాదు. విమానాలుకూడా ఏవీ ఎగురుతున్న జాడలు కనిపించలేదు.

వెనక్కు తిరిగి చూశాడు.

దట్టంగా పెరిగిన చెట్లు — వాటిని అల్లుకుపోయిన తీగెలు.

భారత్ ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడని అను కుంది స్టెల్లా. మిగిలిన వాళ్ళు కూడా అలాగే అను కున్నారు. ఏమైనా వాళ్ళందరిలో స్టెల్లా—భారత్

ఇద్దరే తమకు విముక్తి కలిగించగలరనే నమ్మకం వాళ్ళకు వుంది_ఒకవేళ ఏదైనా అవకాశం వుండే పక్షంలో.

ఉన్నట్టుండి పెదవులు కదిలించాడు భారత్.

"మన ప్రయత్నం కష్టమైనదే. ఐనా ఇంతకంటే మరో మార్గంలేదు. నాకో ఆలోచన వచ్చింది. ఈ దీవిలో ఉన్న టకార జాతి మనుషులకు, ఆండ్రూస్‌కు కూడా మనం ఇక్కడినించి బయటపడటం ఇష్టంలేదులా వుంది. అందుకే మనకు ఈ మార్గం గురించి సూచించలేక పోయారు. అదేమిటంటే ఈ చెట్ల కొమ్మలను విరిచి తీగలతో బిగించి తెప్పల్లాంటివి బలంగా తయారుచేసి వాటి సాయంతో మనం ముందు ఈ దీవినించి బయట పడి సముద్రంలో ప్రయాణం చేద్దాం. కొంతదూరం వెళ్ళిన తర్వాత యేదో ఒక ఓడగాని లేక నాగరిక ప్రపంచంతో సంబంధాలు కలిగివున్న మరో దీవిగాని మనకు కనపడవచ్చు. మన అదృష్టం బావుండి అలా జరిగితే ఫర్వాలేదు. లేక ఈ దీవిలో ఈ మృగాల్లాంటి మనుషుల మధ్య మృత జీవుల్లా చచ్చేవరకూ బతికేకంటే మన ప్రయత్నంలో ప్రాణాలు పోగొట్టుకున్నా ఫర్వా లేదు. ఎందుకంటే అంతకుమించి మనం చేయగలిగింది ఏదీలేదు. ఇందుకు మీరేమంటారు?" అన్నాడు.

భారత్ వూహించని విధంగా అంతా సంతోషంతో అరిచారు. అతడిని అమాంతం పైకెత్తి గాల్లో గిరగిరా తిప్పారు.

ఎదురుచూడని ఆ చర్యకు భారత్ ఆశ్చర్యపోయాడు. స్టెల్లాకూడా షాక్ తిన్నది.

అతడిని కిందికి దించి "మాకు ఇష్టమే. ఈ ఆలోచన

మా అందరికీ నచ్చింది. నిజమే. జీవచ్ఛవాల్లా ఈ మొరటు మనుషుల మధ్య జంతువుల్లా బతికే కంటే మన గమ్యాన్ని చేరే ప్రయత్నంలో మన ప్రాణాలు పోయినా ఇష్టమే. మనకు ఇంతకుమించి మరో మార్గంలేదు. నువ్వు చెప్పినట్టు వినటానికి మేము సిద్ధంగా వున్నాం" అన్నారు అంతా ఏక కంఠంతో.

"థాంక్ యూ. ఐతే ఇక ఆలస్యం ఎందుకు? ఇప్పుడే మన పని మొదలు పెడదాం."

అంతా సరేనన్నారు.

సముద్రం దగ్గర్నించి వెనక్కి తిరిగి వస్తుంటే "ఈ టకార జాతివాళ్ళు పట్టి స్వార్థపరుల్లా ఉన్నారు. లేక పోతే వాళ్ళకు ఈ మార్గం తెలీకుండా వుంటుందా?" అన్నది సెల్లా.

"ఏమో! తెలీదు. వాళ్ళకు తెలీకపోయినా ఆంద్రూస్ కైనా ఈ ఆలోచన రాకుండా ఉండదు. తప్పకుండా వచ్చి వుండాలి. ఐనా మనకు చెప్పలేదు. ఆయనకి సహజంగానే కొంత జెలసీ వుంటుంది. ఎందుకంటే ఆయన ఎన్నో యేళ్ళుగా ఈ దీవిలో ఓ బందీగా జీవితాన్ని గడుపుతున్నాడు. ఆయన ఉద్దేశం మనం కూడా తనకు తోడుగా ఇక్కడే వుండి అలాగే జీవించాలనేమో....అంతే ఐవుంటుంది" అన్నాడు.

అంతా చెట్ల దగ్గరకు వచ్చారు.

"ఈ వంకీ కత్తులు మనకు ఈ విధంగా ఉపయోగ పడబోతున్నాయి. అదృష్టవశాత్తూ మనల్ని యే క్రూర మృగాలూ అటకాయించలేదు. ఇవిగో ఈ కత్తులతో ఇలాంటి పెద్ద కొమ్మలను నరుకుదాం" అంటూ తన

చేతిలో వున్న బల్లేన్ని సెల్లాకు ఇచ్చి ఆమె చేతిలో వున్న వంకీ కత్తిని తను తీసుకున్నాడు.

* * *

అంతా ఉత్సాహంగా కొమ్మలు నరకటం మొదలు పెట్టారు. సెల్లా తీగలు తెంచి భారత్ చెప్పినట్టుగా మరో ఇద్దరి సాయంతో వాటిని కొమ్మలకు వేసి కట్టేస్తోంది.

రెండు గంటలు పైగా గడిచాయి.

ఒకవైపు కొమ్మలను నరుకుతూనే మరోవైపు క్రూర మృగాలు ఏవైనా వస్తున్నాయేమోనని చూస్తున్నాడు భారత్.

వంకీ కత్తులు చప్పుడు చేస్తున్నాయి.

భారత్ నరకటం ఆపేసి తెప్పలను తయారు చేస్తున్నాడు.

ఉన్నట్టుండి వాళ్ళకు పులి గాండ్రింపు వినపడింది. వెంటనే మళ్ళీ వినపడింది. అంతా షాక్ కొట్టినట్లు అదిరిపడి లేచి నిల్చున్నారు.

అలా నిల్చుంటున్నప్పుడే సెల్లా—భారత్‌ల దృష్టి కొంచెం దూరంలో ఓ చెట్టు చాటున నిలబడి తమనే చూస్తోన్న టకారి జాతివాడిమీద పడింది.

వాడ్ని చూసి షాకైవారు వాళ్ళు. సులభంగానే గుర్తుపట్టారు వాడిని. వాడు రాత్రి నల్లమృగం మాంసాన్ని విస్తళ్ళలో పెట్టుకు వచ్చిన వాళ్ళలో ఒకడు.

భారత్—సెల్లా వాడిని చూడటంతోనే కలవరపడి అక్కడినించి వెనక్కి తిరిగి వేగంగా నడిచాడు.

తాత్కాలికంగా వాళ్ళు పులి గాండ్రింపు గురించి మరచిపోయినా మరోసారి ఆ గాండ్రింపు వినేసరికి ఈ

లోకంలోకి వచ్చారు. సరిగ్గా అప్పుడే పెద్ద చావు కేక కూడా వాళ్ళకు వినపడింది.

చెట్ల మధ్యలో ఆకులమీద పొర్లుతున్న చప్పుడు.

ముందుకు పరిగెత్తారు.

చెట్ల వెనుకవైపు వున్న చిన్న ఖాళీ ప్రదేశంలో ఎదురుగా కనిపించిన దృశ్యం చూడగానే చలించి పోయారు.

బల్లెం దూరంగా పడిపోయింది. అక్కడినించి వేగంగా వెళ్ళిన టకార జాతివాడు కిందపడి దొర్లుతున్నాడు. పులి వాడిని పంజాతో కొడుతూనే నోటితో గొంతు పట్టుకోటానికి ప్రయత్నం చేస్తోంది.

వాడు దొర్లుతూనే బల్లెం దగ్గరకు వచ్చాడు. చేత్తో దాన్ని అందుకోబోయాడు. కాని కుదర్లేదు. పులి ఎగిరి చేతిమీదకు దూకింది. పళ్ళతో ఆ చేతిని పీకింది.

హృదయవిదారకంగా అరిచాడు. మణికట్టువరకు చెయ్యి తెగిపోయింది.

ఆ దృశ్యాన్ని చూస్తుంటే అందరి కాళ్ళూ వణికాయి.

స్టెల్లా చూస్తూ వూరుకోలేకపోయింది. రివాల్వర్ బయటకుతీస్తూ "పాపం వాడు అన్యాయంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్నాడు. నువ్వు వెనుకనించి బల్లెం విసురు. నేను షూట్ చేస్తాను" అన్నది స్టెల్లా.

ఆమె ప్రయత్నాన్ని వారించాడు భారత్.

"వద్దు వాడు చావాలి. వాడు బతకటం మనకే ప్రమాదం. ఒకవేళ ఎ డు పులివాత పడకుండా వున్నట్లయితే నేనే వాడ్ని చంపి సముద్రంలోకి విసిరే వాడ్ని."

ఆశ్చర్యంగా అతడి మాటలు అర్థం అవక కళ్ళలోకి చూసింది.

మిగిలినవాళ్ళు ఎగ్సయిట్ మెంట్ తో పులికీ వాడికి జరుగుతున్న పోరాటాన్ని చూస్తున్నారు. ఒంటిచేత్తో నే వాడు పులి దెబ్బలను కాచుకునే ప్రయత్నాలు చేస్తున్నాడు. అప్పటికే వాడి శరీరమంతా గాయాలతో నిండిపోయింది.

కీచకీచల భాషలో ఏదో అరుస్తున్నాడు. "రక్షించండి" కాపాడండి అని అయి వుండవచ్చు.

"అవును స్టెల్లా వాడు చావాలి. వాడితో మనకు ఎటువంటి శత్రుత్వమూ లేకపోయినా ఇలా కోరుకోక తప్పదు. ఎందుకంటే మనం తెప్పలను తయారుచెయ్యటం వాడు చూశాడు. చూసినవాడు వూరుకోడు. నాయకుడికీ, ఆండ్రూస్ కీ చెబుతాడు. వాళ్ళకీ విషయం తెలిస్తే వాళ్ళు మనల్ని యేమయినా చెయ్యొచ్చు. లేకపోతే వీడు మనల్ని రహస్యంగా కనిపెట్టవలసిన అవసరం ఏమిటి?"

స్టెల్లా కళ్ళు మెరిశాయి.

"నువ్వు చెప్పింది నిజం. వాడు బ్రతికే వుంటే మన పథకం అమలు జరిగే అవకాశం వుండదు."

ఇక వాడిలో శక్తి అయిపోయింది. దొరికినచోటునల్లా గాయపరిచింది పులి. చివరకు ఒక్కసారి నోరంతా తెరిచి వాడి గొంతుకు పట్టుకొని కొరికింది.

చావుకేక పెట్టబోయాడు కాని ఆ కేక బయటకు రాలేదు. కీచుమంటూ ఆగిపోయింది.

భయానకమైన ఆ దృశ్యాన్ని చూడలేక కళ్ళు మూసుకున్నారు. భయంతో వణుకుపుట్టింది. యెంతో దగ్గరగా పులి ఓ మనిషిమీద దాడిచేసి పీక కొరికి చంపే

దృశ్యం.

రెండు నిమిషాల్లో వాడిలో చలనం ఆగిపోయింది. వాడిని నోటితో కరిచి పట్టుకుని అక్కడినించి దూరంగా యెక్కడికో పరుగుదీసింది.

అందరూ భారంగా నిట్టూర్చారు.

"మై గాడ్. టెర్రిబిల్ ఇన్సిడెంట్. ఐ హావ్ నెవర్ సీన్ ఇన్ మై లైఫ్" అన్నది సెల్లా.

"ఈ టకార జాతి మనిషి షాంకీల్ లాగే మనల్ని కాపాడాడు. వాడు పులినోటికి దొరక్కుండా వున్నట్లయితే అది తప్పకుండా మనమీద దాడి చేసి వుండేది" భారత్ అన్నాడు.

"గూడెంలో అంతా మనకోసం ఎదురుచూస్తూ ఉంటారు. మిగిలిన పనిని రేపు వచ్చి పూర్తిచేసుకుందాం. ఇక బయల్దేరుదాం" అన్నది సెల్లా.

అప్పటివరకూ నరికిన కొమ్మలను కట్టిన తెప్పలను పొదల మధ్య గుర్తుగా ఒక ప్రదేశంలో యెవ్వరికీ కనపడకుండా దాచి వాటిమీద ఆకులను కప్పేసి బల్లెలతో వంకీ కత్తులతో గూడెంకేసి బయల్దేరారు.

ఇప్పుడు వాళ్ళంతా ఉత్సాహంగా నడుస్తున్నారు. సముద్రం హోరు క్రమంగా మారమవుతోంది.

* * *

ఆ రోజు ఉదయంకూడా వాళ్ళందరికీ మామూలుగానే తెల్లవారింది.

సూర్యుడు ఉదయించాడు. తన వెచ్చని బంగారు కిరణాలతో అందరినీ పలకరించాడు. ఆ రోజు వాళ్ళంతా ఓ, నూతన ఉత్సాహంతో ఉన్నారు.

ఎందుకంటే ఆ ప్రమాదాల బందిఖానాలాంటి దీవి నించి, అనాగరికంగా జీవిస్తున్న ఆ మొరటు మనుషుల నించీ, వెగటు వాసననించీ బయటపడటానికి ఓ మార్గం దొరికినందుకు—

మామూలుగానే వచ్చి నాయకుడికి అంతా అభివాదాలు చేశారు. నాయకుడు సంతోషపడిపోయాడు.

కొంచెం సేపటికి ఆండ్రూస్ వచ్చాడు. అందరినీ ఆప్యాయంగా పలకరించాడు. ఐతే తమ మొహంలో వున్న ఉత్సాహాన్నీ, సంతోషాన్నీ వాళ్లెవరి ఎదుటా కనపరచకూడదని ముందుగానే నిర్ణయం చేసుకున్నందున క్రితం రోజు లాగే కనిపించారు.

ఆండ్రూస్ అప్పుడే టకారాల ఆతిథ్యం గురించి ఒక మాట చెప్పాడు. వాళ్ళు ఏడు రోజులు మాత్రమే ఆతిథ్యం ఇస్తారుట. ఎనిమిదవ రోజునించీ ఆ దీవికి వచ్చిన అతిథి ఎవరైనా తన ఆహారం తనే సంపాదించుకోవాలి. తన ఇల్లు తనే నిర్మించుకోవాలి.

లెక్కలు వేసుకున్నారు భారత్ వాళ్ళు.

అప్పటికి తాము టకారాల ఆతిథ్యం స్వీకరించి మూడు రోజులు అయ్యింది. అంటే ఇంకో నాలుగు రోజులవరకే తమకు టకారాల ఆతిథ్యం వుంటుంది. అంటే ఆ తర్వాత ఆ దీవిలోనే వుంటే తాము కూడా నల్లమృగాలను వేటాడక తప్పదు.

ఆండ్రూస్ ఇంకా ఆ దీవి వాసులకు వున్న రకరాల ఆచారాల గురించి చెబుతున్నాడు. అంతా ఆసక్తిగా వింటున్నారు. అతను తన మాటలను ముగించగానే త్వరగా సముద్రం దగ్గరకు వెళ్ళి చెట్లను నరికి తెప్పలను కట్టుకుందాం అనే ఆలోచనలో వున్నారు.

సరిగ్గా ఇలాంటి సమయంలోనే ఓ ఐనుగురు టకార జాతి మనుషులు చేతిలో బల్లేలు పట్టుకుని వగరుస్తూ పరిగెత్తుకుని వచ్చారు. వాళ్ళ పక్కనే రెండు మెడలు పొడుగ్గా వున్న జంతువులు ఉన్నాయి. అవి నక్కల్లా వున్నాయి కాని నక్కలు కాదు. వాటి తోకలు బాగా పొడుగ్గా భూమిని తాకుతున్నట్టున్నాయి. కళ్ళు పిల్లి కళ్ళలా వున్నాయి. అవికూడా నాలుకలను బయటకు వుంచి చొంగ కారుస్తూ వాళ్ళ పక్కనే పరిగెడుతూ వచ్చాయి.

వాళ్ళంతా అదే మొదటిసారిగా ఆ జంతువులను చూడటం. అవి వేటకుక్కల్లాంటి జంతువులు అయి వుంటాయనుకున్నారు.

కాని-ఆ జంతువులు ఒక విలక్షణమైన గుణం కలిగినవి. చచ్చిపోయిన మనుషుల జాడను యెక్కడ వున్నా పసిగట్టగలవు. ఆ క్రితంరోజు మధ్యాహ్నం నల్లమృగాల వేటకు వెళ్ళి తిరిగిరాని టాకారజాతి మనిషి ఆచూకీకోసం వాటిని తీసుకుని వెళ్ళారు. కాని అవి ఆ మనిషి గురించి తెలియజెయ్యకపోయినా మరో మనిషి గురించి తెలియ జేశాయి.

వాళ్ళ మొహంలో కనపడుతున్న ఆతృతను చూడగానే ఆంద్రూస్, నాయకుడితోపాటు మిగిలినవాళ్ళు కూడా యేదో జరిగివుంటుందనీ, ఏదో ఒక విషయం వాళ్ళను కలవరపరిచి వుంటుందనీ గ్రహించారు.

కిచకిచల భాషలో నాయకుడితో రెండు క్షణాల్లో విషయాన్నంతా చెప్పేశారు.

ఆ వార్త వింటూనే నాయకుడు ఉగ్రుడైపోయాడు. పళ్ళు కొరుకుతూ ఒక్కసారిగా సింహాసనం మీదనించి

లేచి నిలబడ్డాడు పెద్దగా కేకలు పెడుతూ—

వాళ్ళు చెబుతున్నప్పుడే ఆంద్రూప్‌కు ఆ వార్త యేమిటో అర్థమైపోయింది. మనసులో ఏమనుకున్నాడో యేమో గాని పైకి మాత్రం గంభీరంగా మొహాన్ని సీరియస్‌గా వుంచుకున్నాడు.

నాయకుడు నిలుచోగానే మిగిలినవాళ్ళుకూడా అంతా లేచి నిలబడ్డారు.

అందరికీ నాయకుడి మొహం చూడగానే భయంతో ఒళ్ళు జలదరించింది. అప్పటివరకు ఎంతో ప్రశాంతంగా ఉన్న నాయకుడి మొహం ఒక్కసారిగా అలా వికృతంగా—కర్కశంగా—ప్రళయంగా కనపడేసరికి వణుకు పుట్టింది.

భారత్‌కీ సెల్లాకీ నాయకుడి ఆగ్రహానికి కారణం ఏమిటో ఆ భాష అర్థం అవకపోయినా అక్కడి పరిస్థితినిబట్టి నాయకుడి ప్రళయరూపం చూసి అర్థమయిపోయింది.

అదే—ఆ రెండు నక్కల్లాంటి జంతువులు పాంకీల్ శవాన్ని పసిగట్టాయి. అక్కడ తవ్వి చూసిన టకారా జాతి మనుషులు ఆ శవాన్ని చూసి నాగరికుల శవంగా గుర్తుపట్టి ఆ శవం రెండు రోజులక్రితమే పూడ్చిపెట్టబడిందని తెలుసుకున్నారు.

నాగరికులను చూస్తూ నాయకుడు కిచకిచల భాషలో ఘోరంగా అరుస్తున్నాడు.

సెల్లాకీ—భారత్‌కీ శరీరమంతా తెలియని భయం యేదో ఆవహించుకున్నది.

తామంతా ఏదైతే జరగకూడదని భయపడ్డారో అదే జరిగింది. పాంకీల్ శవం బైటపడింది. ఓ శవాన్ని

భూమిలో పాతిపెట్టటం ఆ జాతి మనుషుల ఆచారాలకు యెంత విరుద్ధమైనదో ఆంద్రూస్ చెప్పాడు. పైగా దాని పర్యవసానం చాలా దారుణంగా వుంటుందనికూడా అన్నాడు.

దారుణంగా అంటే యేమిటి?

ఆంద్రూస్ వైపు తిరిగాడు నాయకుడు. ఆయనతో ఏదో చెప్పాడు నిప్పులు రాలుతున్న కళ్ళతో....

అప్పుడు ఆంద్రూస్—భారత్ తో ఇలా అన్నాడు.

"మనం భయపడిందే జరిగింది. ఐతే నిన్న మధ్యాహ్నం నల్లమృగాలకోసమని వెళ్ళిన ఈ గూడెం మనిషి ఒకడు అదృశ్యమైపోయాడు. వాడు యేదైనా క్రూరజంతువువాత పడ్డాడేమో తెలుసుకోటానికి పొడుగాటి మెడలు వున్న జంతువులతో వెళ్ళారు. ఈ జంతువులు ఆ విషపండు తిని మరణించిన మీ మనిషి శవాన్ని వాసనపట్టి వీళ్ళకు చూపించాయి. వాళ్ళు గొయ్యి తవ్వి శవాన్ని చూశారు. ఆ శవం మీకు సంబంధించిన మనిషి దేననీ, ఆ శవాన్ని మీరే పాతిపెట్టారని తెలుసుకుని వచ్చి ఇప్పుడు నాయకుడితో చెప్పారు.

నేను మీకు ముందే చెప్పానుకదా! మరణించిన మనిషిని ఈ దీవిలో ఏం చేస్తారో? అలా కాకుండా పాతిపెడితే ఇక్కడ యెంత అపచారమో కూడా చెప్పాను. ఇప్పుడు నాయకుడు మీమీద కోపంతో మండిపడుతున్నాడు. మీకంతా అతిధ్యం ఇచ్చిన మనిషికి నమ్మకద్రోహం చేశారని అంటున్నాడు. ఇలా ఎందుకు చేశారో మిమ్మల్ని అడగమంటున్నాడు?"

ఆగి నాయకుడి మొహంలోకి చూశాడు ఆంద్రూస్.

సరిగ్గా అప్పుడే డప్పుల మోత వినిపించింది.

"జరిగిందంతా మీకు ఇంతకు ముందే చెప్పాను. పాంకీల్ విష పండు తిని మరణించాడు. మా ఆచారం ప్రకారం అతడి శవాన్ని జంతువులు పీక్కు తినకుండా వుండేందుకు గొయ్యితీసి పాతిపెట్టాము. అప్పటికి ఈ దీవిలో మీరంతా ఉన్నారని కూడా మాకు తెలీదు. అందువల్లనే ఆ మనిషిని పాతిపెట్టడం జరిగింది. ఇందులో మా తప్పు ఏమిటో మాకు తెలీదు. తెలియక చేసిన అపచారమే ఐనా మమ్మల్ని క్షమించవలసిందిగా నాయకుడిని కోరుతున్నట్టుగా చెప్పండి" అన్నాడు భారత్.

"నాయకుడు ఇందుకు ఒప్పుకుంటాడని నాకు నమ్మకం లేదు. ఎందుకంటే ఆచారాలు, నమ్మకాల విషయంలో ఎంత గట్టి పట్టుదల ఉన్న మనుషులో మీకు తెలీదు. ఐనా నువ్వు నాయకుడికి చెప్పమంటున్నావు కాబట్టి చెబుతాను" అంటూ భారత్ చెప్పినదంతా నాయకుడికి చెప్పాడు.

డప్పుల మోత ఆగిపోగానే గూడెంలో ఉన్న టకార జాతి మనుషులంతా అక్కడకు గబగబా వచ్చేశారు. స్త్రీలంతా పిల్లల్ని కూడా తీసుకువచ్చారు. వాళ్ళందరినీ గమనించాడు భారత్. వెంటనే అతనికి ఒక విషయం మాత్రం చాలా క్లియర్‌గా తెలిసిపోయింది.

శవాన్ని పాతిపెట్టిన విషయం వాళ్ళందరిలోనూ, ఎంతో గొప్ప సంచలనాన్ని, భయాన్ని లేవదీసిందనీ గ్రహించాడు.

అంటే ఆ విషయానికి వాళ్ళెంత ప్రాముఖ్యత ఇస్తున్నారో అర్థమయిపోయింది. (సశేషం)